వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

Published From : Rangareddy VOLUME : 01 Issue : 310 Wednesday, 28-10-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal–Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

హైసెక్యూరిటీ జైలు బ్లాక్‌లోకి

గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్..!

7

రాజీవ్ ప్రధాని

కావడం నాకిష్టం లేదు

7

అభిషేక్ శతక విధ్వంసం

మూడో టీ20లో న్యూజిలాండ్‌పై భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం

- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 3--0 ఆధిక్యంతో సిరీస్ కైవసం
- 38 బంతుల్లో 113 పరుగులతో చెలరేగిన అభిషేక్ శర్మ
- కేవలం 35 బంతుల్లోనే శతకం పూర్తి చేసిన భారత ఓపెనర్
- వైభవ్ సూర్యవంశీ 45 పరుగులు.. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం
- పవర్‌ప్లేలో 118 పరుగులు సాధించిన భారత బ్యాటర్లు
- 13.2 ఓవర్లలోనే 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- కివీస్ తరపున డారిల్ మిచెల్ 89 పరుగులతో పోరాటం

02

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత బ్యాటర్లు పరుగుల వర్షం కురిపించారు. ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసకర శతకంతో చెలరేగడంతో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. వెల్లింగ్టన్ వేదికగా జరిగిన పోరులో న్యూజిలాండ్ నిర్దేశించిన 199 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా కేవలం 13.2 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. అభిషేక్ 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, 38 బంతుల్లో 113 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 45 పరుగులు చేయగా, వీరిద్దరూ తొలి వికెట్‌కు 133 పరుగులు జోడించి విజయానికి పునాది వేశారు. పవర్‌ప్లే ఆరు ఓవర్లలోనే భారత్ 118 పరుగులు సాధించింది. అంతకుముందు డారిల్ మిచెల్ 89 పరుగులతో రాణించడంతో న్యూజిలాండ్ 198 పరుగులు చేసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3--0 ఆధిక్యంతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే కైవసం చేసుకున్నట్లు అందించిన మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి.

సమ్మిట్‌ను సక్సెస్ చేద్దాం

ప్రపంచ వేదికపై తెలంగాణ సత్తా చాటాలి!

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- డిసెంబర్ 7 నుంచి ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు
- అక్టోబర్ 29న ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం
- నవంబర్ తొలి వారంలోగా అన్ని ఏర్పాట్ల ప్రణాళికలు ఖరారు చేయాలని ఆదేశం
- దేశవిదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులకు ఇబ్బందులు కలగొద్దని సూచన
- హైదరాబాద్ నగరవ్యాప్తంగా డ్రోన్లతో వినూత్న ప్రచారానికి ఏర్పాట్లు
- కృత్రిమ మేధ, వాతావరణ మార్పుల రంగాల అంతర్జాతీయ ప్రముఖులకు ఆహ్వానం
- కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, బతుకమ్మ సంస్కృతి ప్రతిబింబించేలా సదస్సు ప్రాంగణం

/హైదరాబాద్:

గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ ప్రపంచ స్థాయిలో మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నెల 29న ఢిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ ప్రోగ్రామ్, జాతీయశీక పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షణ ఎక్స్‌పో, ఇండియా జాయ్ ఈవెంట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

-మిగతా 2 లో

02

దాడులు ఆపితే ఒక బిలియన్

డాలర్‌లు ఇస్తాం

హౌతీలకు సౌదీ భారీ ఆఫర్..!

రూట్ మార్చిన కాంగ్రెస్!

- 'చలో ఢిల్లీ'కి ప్రత్యేక రైళ్లకు కేంద్రప్రభుత్వం నిరాకరణ
- స్లీపర్ బస్సుల్లో హస్తినకు వెళ్లాలని నేతల నిర్ణయం

02

వచ్చే ఎన్నికల్లో వంద సీట్లే మా లక్ష్యం!

- తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న టీపీసీసీ చీఫ్
- అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాలు సాధించడమే లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడి
- నవంబర్ తర్వాత ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి
- కేటీఆర్, హరీశ్‌రావు క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోవాలని సూచన
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే తమ బలమని వ్యాఖ్య
- ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, ఉద్యోగాల భర్తీపై ప్రజల్లోకి వెళ్తామని వెల్లడి
- గత బీఆర్‌ఎస్ పాలన రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శ
- తెలంగాణలో బీజేపీకి రాజకీయ భవిష్యత్తు లేదని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు

హైదరాబాద్,

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో 100 స్థానాలను సాధించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. సచివాలయంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రాబోయే ఎన్నికల సన్నద్ధతపై పలు అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న కొన్ని సమస్యలకు నవంబర్‌లో పరిష్కారం

-మిగతా 2 లో

ఇంకో ఏడాదే.. ఆ తర్వాత కేసీఆర్ వస్తారు!

- కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో మంచి రోజులు వస్తాయని ధీమా
- ప్రజలను విభజించడంలో బీజేపీ.. దోచుకోవడంలో కాంగ్రెస్ బిజీగా ఉన్నాయని విమర్శ
- నిర్మల్‌కు బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ ఏం చేశారో నిలదీయాలని పిలుపు
- నిర్మల్‌ను జిల్లాగా మార్చింది కేసీఆరేనని గుర్తుచేసిన కేటీఆర్
- వైద్య, నర్సింగ్ కళాశాలలు, సాగునీటి ప్రాజెక్టులు బీఆర్‌ఎస్ హయాంలోనే వచ్చాయని వెల్లడి
- అవకాశవాదులు వెళ్లిపోయినా పోరాట యోధులు బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారని వ్యాఖ్య

హైదరాబాద్:

మీ నిర్మల్ తాలూకాలో బీజేపీ ఎమ్మెల్యే ఉన్నరు, బీజేపీ ఎంపీ ఉన్నరు.. నిర్మల్‌కు బీజేపీ ఏం చేసిందో ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కేటీఆర్ సమక్షంలో భారీగా చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఢిల్లీలో బీజేపీ ప్రజలను విభజించడంలో బిజీగా ఉంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలను దోచుకోవడంలో బిజీగా ఉన్నారు.. తప్ప వాళ్ల చేసిందేమీ కాదు.. మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా, గోడం నగేశ్ ఎంపీగా గెలిచారు..

-మిగతా 2 లో

ఓటు పరిరక్షణ ఉద్యమం కొనసాగిస్తాం

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్
- పేదల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని తీవ్ర ఆరోపణ
- ఢిల్లీలోని త్రిలోక్‌పురిలో 'ఓటు హక్కు.. జీవించే హక్కు' ప్రజా విచారణ
- ఎన్నికల సంఘం నుంచి సరైన సమాధానాలు రావడం లేదని విమర్శ
- సీఈసీ రాజీనామా లేదా తొలగింపు వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టీకరణ

02

అర్నాబ్.. ఉగ్రరూపం

తెలుగు రాష్ట్రాలకు తుపాను ముప్పు!

- బంగాళాఖాతంలో అతి తీవ్ర తుపానుగా మారిన 'అర్ణాబ్'
- నేడు యానాం సమీపంలో తీరం దాటే అవకాశమని హెచ్చరికలు
- ఆంధ్రప్రదేశ్ తీరంలో బీచ్‌లు, తీరప్రాంత రహదారుల మూసివేత
- 16 జిల్లాల్లోని 2,460 గ్రామాలు, 92 పట్టణ ప్రాంతాలపై ప్రభావం పడే అవకాశం
- 11 జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల తరలింపు
- తెలంగాణలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు భారీ వర్ష సూచన
- మత్స్యకారుల వేటపై నిషేధం.. 30 వేల పడవలు రేవుల్లో నిలిపివేత
- 1,763 సహాయక శిబిరాలు సిద్ధం.. రంగంలోకి 3,185 మంది నోడల్ అధికారులు

02

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నాబ్' అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాలను వణికిస్తోంది. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తున్న తుపాను బుధవారం ఉదయం బాపట్ల--విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశముందని వాతావరణ హెచ్చరికలు పేర్కొంటున్నాయి. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల ముప్పుతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమై తీరప్రాంత బీచ్‌లు, రహదారులను మూసివేసినట్లు సమాచారం. 16 జిల్లాల్లోని 2,460 గ్రామాలు, 92 పట్టణ ప్రాంతాలపై ప్రభావం పడే అవకాశముండటంతో సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోనూ అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరికలు వెలువడ్డాయి.

02

17 మంది ఖైదీలు పరార్

- ఫిట్స్ వచ్చినట్లు నటించి, గార్డులపై దాడి చేసి జంప్
- సిబ్బందిని బంధించి తాళాలు లాక్కున్న ఖైదీలు
- ప్రధాన ద్వారం నుంచి బయటకు పరుగులు
- గార్డు మెడలోని బంగారు గొలుసు కూడా అపహరణ
- పరారైన ఖైదీల కోసం పోలీసుల విస్తృత గాలింపు
- కేరళ సరిహద్దులు, అటవీ ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా
- విధుల్లో నిర్లక్ష్యంపై తొమ్మిది మంది సిబ్బంది సస్పెన్షన్

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సమ్మిట్‌ను సక్సెస్ చేద్దాం

మొదటి తరువాయి

నవంబర్ మొదటి వారంలోగా ప్రణాళికలను ఖరారు చేసుకుని, పలు దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే సీఈవోలు, ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ తదితర రంగాల్లో గొప్ప విజయాలు సాధించిన వివిధ ప్రముఖులను అతిథులకు తెలియజేసేలా హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రచార ఏర్పాట్లు చేశారు. నగరంలో పలు చోట్ల డ్రోన్ ఆధారిత ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. క్లైమేట్ చేంజ్, ఏఐ రంగాలకు సంబంధించిన ప్రపంచ స్థాయి ప్రముఖులను గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించాలని తెలిపారు. ఏవిజిసి (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) రంగానికి సంబంధించి ప్రత్యేకంగా చేస్తున్న ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. తెలంగాణ సాంప్రదాయాలు ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్ ఆవరణలో డిజైన్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఎం అధికారులు లకు సూచించారు. కాకతీయ కళా తోరణం, రామప్ప ఆలయం డిజైన్లకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. బతుకమ్మ పండుగ గురించి అతిథులు తెలుసుకునేలా ప్రత్యేకంగా చేస్తున్న డిజైన్లు, ఏర్పాట్లపై అధికారులు వివరించారు. ఈ సమావేశంలో సీఎస్ సంజయ్ జా?, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ డి. అనుదీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దాడులు ఆపితే ఒక బిలియన్ డాలర్‌లు ఇస్తాం..

- హౌతీలకు సౌదీ భారీ ఆఫర్..!

న్యూఢిల్లీ: : సౌదీ అరేబియా హౌతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులతో పశ్చిమాసియా లో ఘర్షణలు తీవ్రస్థాయికి చేరాయి. సౌదీలోని మౌలిక సదుపాయాలు, చమురు క్షేత్రాలను హౌతీలు డ్రోన్‌లు, క్షిపణులతో టార్గెట్ చేస్తుండటంతో సంపన్న దేశం తీవ్ర ఆర్థిక, ప్రాణ నష్టాలను చవిచూస్తున్నది. హర్మూజ్ జలసంధి లో ట్యాంకర్లపై ఇరాన్ చేస్తున్న దాడులవల్ల గల్ఫ్ దేశాల నుంచి చమురు ఎగుమతులకు కూడా అంతరాయం కలుగుతున్నది.దేశంలోని విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై దాడులు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఎట్టకేలకు హూతీలతో రాజీకొచ్చారు. కాల్పుల విరమణ కోసం ఇరాన్ మధ్యవర్తిత్వంతో తిరుగుబాటుదారులకు ఓ ఆఫర్ ఇచ్చారు. హౌతీలు తమ దేశంపై దాడులను పూర్తిగా ఆపితే 1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9,500 కోట్లు) ఇస్తామని సౌదీ యువరాజు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మొత్తాన్ని ఇరాన్ ద్వారానే హూతీలకు అందించే అవకాశం ఉంది. ఈ మేరకు ఇజ్రాయెల్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ఒప్పందం కోసమే ఇటీవల సౌదీ రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ టెహ్రాన్‌కు వెళ్లినట్లు సమాచారం. ఆయన వచ్చిన సైనిక రవాణా విమానంలోనే హౌతీలకు ఇవ్వదలిచిన మొత్తం డబ్బును తీసుకువచ్చినట్లు తెలుస్తున్నది. అయితే ఈ విషయాన్ని సౌదీ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఇరాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన శాంతి చర్చల్లో టర్కీ ఇంటెలిజెన్స్ చీఫ్, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, ఐఆర్‌జీసీ సీనియర్ అధికారులు పాల్గొన్నట్లు తెలిసింది. గతంలో హూతీలు యెమెన్ సర్కారుతో పోరాడుతున్న సందర్భంలో వ్యతిరేకంగా సౌదీ అరేబియా ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. ఇక అప్పటి నుంచి వీరి మధ్య ప్రత్యక్ష పోరు జరుగుతోంది. ఈ క్రమంలోనే సౌదీ వారితో ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందుకు వచ్చింది.

వచ్చే ఎన్నికల్లో వంద సీట్లే మా లక్ష్యం!

మొదటి తరువాయి

లభిస్తుందని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. నవంబర్ తర్వాత పార్టీ ఎన్నికల సన్నద్ధతపై మరింత దృష్టి సారిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ వ్యవహారాల్లో తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం కొనసాగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు ప్రధాన బలమని మహేష్‌కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 90 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా పార్టీ శాశ్వతంగా ఉంటుందని, కాంగ్రెస్ సంస్థాగతంగా బలంగా ఉందని వ్యాఖ్యానించారు. మరోవైపు బీఆర్ఎస్ నాయకులపై మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల భారంలో చిక్కుకుందని ఆరోపించారు. కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న పరిస్థితుల విషయంలోనూ హరీశ్‌రావు వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. తెలంగాణలో బీజేపీ రాజకీయ భవిష్యత్తుపైనా ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిది మంది బీజేపీ ఎంపీల్లో వచ్చే ఎన్నికల్లో ఇద్దరు గెలిచినా ఎక్కువేనని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు తిరిగి గెలవడం కష్టమని తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో కాంగ్రెస్ 40 శాతం స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు.

అభిషేక్ శతక విధ్వంసం.

- మూడో టీ20లో న్యూజిలాండ్‌పై భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 3--0 ఆధిక్యంతో సిరీస్ కైవసం
- 38 బంతుల్లో 113 పరుగులతో చెలరేగిన అభిషేక్ శర్మ
- కేవలం 35 బంతుల్లోనే శతకం పూర్తి చేసిన భారత ఓపెనర్
- వైభవ్ సూర్యవంశీ 45 పరుగులు.. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం
- పవర్‌ప్లేలో 118 పరుగులు సాధించిన భారత బ్యాటర్లు
- 13.2 ఓవర్లలోనే 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- కివీస్ తరపున డారిల్ మిచెల్ 89 పరుగులతో పోరాటం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడవ టీ20 మ్యాచ్ లో ఇండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది.కివీస్ విసిరిన 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలో అందుకున్నది. దీంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 3-0 ఆధిక్యాన్ని సాధించి సిరీస్‌ను వశం చేసుకున్నది. ఓపెనర్ అభిషేక్ శర్మ సూపర్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిన అతను కేవలం 35 బంతుల్లో సెంచరీ కొట్టాడు. అభిషేక్ 38 బంతుల్లో 113 రన్స్ చేసి ఔటయ్యాడు. ఛేజింగ్‌లో ఇండియన్ ఓపెనర్లు చెలరేగిపోయారు. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ ఇద్దరూ తొలి వికెట్‌కు రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ ఇద్దరూ తొలి వికెట్‌కు 133 రన్స్ జోడించారు. వైభవ్ 45 రన్స్ చేసి ఔటయ్యాడు. అయితే పవర్ ప్లేలో ఇండియా కొత్త రికార్డు క్రియేట్ చేసింది. 6 ఓవర్లలోనే భారత ఓపెనర్లు 118 రన్స్ చేశారు. కివీస్ బౌలర్లు ఏ దశలోనూ తమ ప్రభావాన్ని చూపలేకపోయారు. అభిషేక్, వైభవ్ ఆడుతున్న తీరు.. కివీస్ బౌలర్లలో దడపుట్టించింది. ఇండియా కేవలం 4 వికెట్లు కోల్పోయి టార్గెట్ చేరుకున్నది. కివీస్ బౌలర్లలో జేమీసన్ రెండు వికెట్లు తీసుకున్నాడు.తొలుత ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 రన్స్ చేసింది. డారెల్ మిచెల్ డాషింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. అతను 52 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 89 రన్స్ చేశాడు. కివీస్ ఇన్నింగ్స్‌లో ఫిన్ అలెన్ 40, గ్లెన్ ఫిలిప్స్ 17, బెవాన్ జాకబ్స్ 39 రన్స్ చేశారు. జాకబ్స్ 23 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 39 రన్స్ చేశాడు. నాలుగో వికెట్ జాకబ్స్, మిచెల్ అజేయంగా 75 రన్స్ జోడించారు. ఆ ఇద్దరూ నాటౌట్‌గా నిలిచారు. భారత బౌలర్లలో నితీశ్, అక్షర్, అర్షదీప్ చెరో వికెట్ తీసుకున్నారు.

రూట్ మార్చిన కాంగ్రెస్!

- 'చలో ఢిల్లీ'కి ప్రత్యేక రైళ్లకు కేంద్రప్రభుత్వం నిరాకరణ
- స్లీపర్ బస్సుల్లో హస్తినకు వెళ్లాలని నేతల నిర్ణయం

తెలంగాణ బ్యూరో: ఢిల్లీ వేదికగా నరేంద్రమోదీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న తలపెట్టిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ర్యాలీయై బీజేపీ ప్రభుత్వం ముందే అడ్డుకోవాలని భావించిందా? తెలంగాణ నుంచి తరలివచ్చే భారీ జన సందోహాన్ని చూసి కమలనాథుల్లో వణుకు మొదలైందంటే గాంధీభవన్ వర్గాలు అవుననే చెబుతున్నాయి. నవంబర్ 1న దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో నిర్వహించనున్న మెగా నేషనల్ ర్యాలీయై ఎలాగైనా నీరుగార్చేందుకు కేంద్రం తెరవెనుక తీవ్ర కుట్రలకు తెరలేపిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. చివరి నిమిషంలో ప్రత్యేక రైళ్లకు అనుమతులు ఇవ్వకుండా నిరాకరించి అడ్డంకులు సృష్టించిందని మండిపడ్డారు. ఇదిలాఉండగా, కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించినా ప్రత్యామ్నాయ మార్గంలో దాదాపు 10వేల మంది క్యాడర్‌ను తరలించి తీరుతామని టీపీసీసీ 'ప్లాన్ బీ'తో రచించింది.

రైల్వే అనుమతులు రద్దు

రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 10వేల మందికి పైగా ముఖ్యనేతలు, కార్యకర్తలను రాంలీలా మైదానానికి తరలించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం తొలుత ప్రత్యేక రైళ్లను బుక్ చేయాలని నిర్ణయించింది. దీనికోసం రైల్వే నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలు పూర్తి చేసేందుకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన తీవ్రమైన రాజకీయ ఒత్తిళ్లతో రైల్వేశాఖ అనుమతి ఇవ్వడానికి ససేమిరా అంటున్నట్లు కాంగ్రెస్‌నేతలు పేర్కొంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మంగళవారం హూటాహుటినా ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి జిల్లా నుంచి రెండు స్లీపర్ బస్సుల్లో తరలించేలా ఆర్టీసీతో పాటు ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. కొందరు నేతలు చావ్యాంగా సికింద్రాబాద్, కాజీపేట, నాంపల్లి స్టేషన్ల నుంచి ఢిల్లీకి నడిచే రెగ్యులర్ సూపర్ ఫాస్ట్ రైళ్లలో (తెలంగాణ, దక్షిణ, రాజధాని, సంపర్క్ క్రాంతి) పెద్దసంఖ్యలో సాధారణ టికెట్లు, బెర్త్‌లను ముందుగానే బుక్ చేసుకున్నారు. దీంతో నాలుగువేల మంది కార్యకర్తలు ఈనెల 29, 30 తేదీల్లో విడతల వారీగా బయలుదేరి వెళ్లనున్నారు. మహారాష్ట్ర సరిహద్దు జిల్లైన ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ శ్రేణులు వందలాది సొంత కార్లు, క్రూయిజ్ వాహనాలతో ఎన్‌హెచ్-44 మీదుగా భారీ కాన్వాయ్‌లుగా తరలేందుకు సమాయత్తమయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలు అక్టోబర్ 31 నాటికి విమా?ల్లో నేరుగా ఢిల్లీ చేరుకోనున్నారు. కేంద్రంలో లో బీజేపీ సర్కార్ ఎంతగా అడ్డుకున్నా, రైళ్లను రద్దుచేసినా అంతకు రెట్టింపు కసీతో రాంలీలా మైదానాన్ని కాంగ్రెస్ శ్రేణులతో నింపేస్తామని, కేంద్రానికి ఢిల్లీ వేదికగా గట్టి సమాధానం చెబుతామని అధికారపార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇంకో ఏడాదే.. ఆ తర్వాత కేసీఆర్ వస్తారు!

మొదటి తరువాయి

ఏమొచ్చింది నిర్మల్‌కు.. అదే కేసీఆర్ ఉన్నప్పుడు నిర్మల్‌కు ఏమొచ్చిందని అడగొచ్చు.. నిర్మల్‌ను జిల్లా చేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్‌లో మెడికల్ కాలేజీ పెట్టిందెవరు.. నర్సింగ్ కాలేజీ పెట్టిందెవరు.. నిర్మల్‌లో అభివృద్ధికి బాటలు వేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్ పట్టణంలోకానీ, తాలూకాలో కానీ నేను స్వయంగా వచ్చి మీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభించిన. నేనొచ్చి మిషన్ భగీరథ ద్వారా మీ ఇంటింటికి తాగునీళ్లిచ్చే కార్యక్రమం మొదలుపెట్టిన. బ్రహ్మాండంగా చెక్‌డ్యామ్‌లు కట్టుకున్నం.. అయిల్ ఫామ్‌లు పెట్టుకున్నమన్నారు. నిర్మల్‌లో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్ గెలిచినా నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి అధికారం కోల్పోగానే పార్టీని వీడి పారిపోయాడు. అవకాశవాదులు పార్టీని వీడినా, పోరాట యోధులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. ఎప్పుడైనా ప్రతీ పార్టీలో రెండు రకాల వ్యక్తులుంటారు.. ఒకటి అవకాశవాదులుంటారు.. రెండోది పోరాటవాదులుంటారు.. ఆయన అవకాశవాదంతో బయటకు పోయినా మేమున్నం అన్నా భయపడకండని పోరాడుతున్న మీ అందరికీ తలవంచి నమస్కారం చేస్తున్నా.. మంచి రోజులు ముందున్నయి. ఇంకో సంవత్సరమే వీళ్ల కథ.. మూడేళ్లయిపోయింది.. సినిమా ఇంటర్వెల్ కూడా పూర్తయిపోయింది. సెకండాఫ్ కూడా చాలా అయింది.. ఇంకా ఎక్కువ టైం కూడా లేదు.. ఇంకో సంవత్సరం మాత్రమే ఉంది.. ఆ తర్వాత కేసీఆర్ వస్తరు.. మనందరికీ మంచి రోజులొస్తయని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

అర్నాబ్..ఉగ్రరూపం..

/హైదరాబాద్: బంగాళాఖాతంలో భయం రేపుతున్న 'అర్నాబ్' తుపాను ముప్పుతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ అతి తీవ్ర తుపాను విశాఖపట్నం, బాపట్ల మధ్య యానాం దగ్గర బుధవారం ఉదయం తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలతోపాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపాను కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడంతో ప్రాణ నష్టం జరగకుండా చూడటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి కోస్తా తీర ప్రాంత రహదారులతో పాటు బీచ్‌లను పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. విశాఖలోని రుషి కొండ, ఆర్కే బీచ్‌లతో పాటు బాపట్ల జిల్లాలోని సూర్యలంక, చీరాల, ఊటేవు, రామపురం, పొట్టిసుబ్బయ్యపాలెం బీచ్‌ల వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. పర్యాటకులు ఎవరూ రావద్దని సూచించారు. అధికారిక ఉత్తర్వులు వెలువడే వరకు బీచ్‌లలో ఆంక్షలు కొనసాగుతాయని తెలిపారు. తుపాను ప్రభావంతో వైజాగ్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. తుపాను అతి తీవ్రంగా మారడంతో 11 జిల్లాలకు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను హుటాహుటిన తరలించారు. 16 జిల్లాల్లోని 2,460 గ్రామాలు, 92 పట్టణ ప్రాంతాలపై తుపాను ప్రభావం తీవ్రంగా పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ముప్పు రాకుండా తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని విద్యా సంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. మరోవైపు సముద్రం తీవ్రరూపం దాల్చింది. ఉప్పాంద లాంటి చోట్ల రాళ్లగట్లను సైతం దాటుకుని అలలు రోడ్లపైకి దూసుకొస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. సముద్రంలో వేటను పూర్తిగా నిషేధించి, సుమారు 30 వేల మత్స్యకారుల పడవలను సురక్షితంగా రేవుల్లో నిలిపివేశారు. బాధితులకు ఆశ్రయం కల్పించేందుకు ప్రభుత్వం 1,763 సహాయక శిబిరాలను సిద్ధం చేసింది. విపత్తు నిర్వహణ కోసం 3,185 మంది నోడల్ ఆఫీసర్లను రంగంలోకి దించింది.

17 మంది ఖైదీలు పరార్

- ఫిట్స్ వచ్చినట్లు నటించి, గార్డులపై దాడి చేసి జంప్
- సిబ్బందిని బంధించి తాళాలు లాక్కున్న ఖైదీలు
- ప్రధాన ద్వారం నుంచి బయటకు పరుగులు
- గార్డు మెడలోని బంగారు గొలుసు కూడా అపహరణ
- పరారైన ఖైదీల కోసం పోలీసుల విస్తృత గాలింపు
- కేరళ సరిహద్దులు, అటవీ ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా
- విధుల్లో నిర్లక్ష్యంపై తొమ్మిది మంది సిబ్బంది సస్పెన్షన్

నేషనల్ బ్యూరో: తమిళనాడులోని తేని జిల్లా శీలయపట్టి సమీపంలోని తెక్కంపట్టి జిల్లా జైలులో సోమవారం రాత్రి షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. జైలు సిబ్బందిపై దాడి చేసి 17 మంది రిమాండ్ ఖైదీలు పరారయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు 13 మందిని పట్టుకోగా, మిగిలిన నలుగురి కోసం గాలింపులు ముమ్మరం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారంటూ 9 మంది జైలు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది.

ఫిట్స్ వచ్చినట్లు నటించి..

సోమవారం రాత్రి 10.00 గంటల ప్రాంతంలో జైలులోని 3వ బ్లాక్లో ఉన్న ఒక ఖైదీకి ఫిట్స్ (మూర్ఛ వ్యాధి) వచ్చిందని మిగతా ఖైదీలు గట్టిగా కేకలు వేశారు. దీంతో అక్కడ ఉన్న పారా గార్డ్ సెల్ను పరిశీలించడానికి లోపలికి వెళ్లగా, 17 మంది ఖైదీలు ఒక్కసారిగా ఆయనపై దాడి చేసి బంధించారు. అనంతరం ప్రధాన ద్వారం వద్ద ఉన్న మరో ఇద్దరు గార్డులపై దాడి చేసి, వారి వద్ద నుంచి తాళాలు లాక్కుని జైలు బయటకు పరుగులు తీశారు. ఈ క్రమంలో ఓ గార్డ్ మెడలోని 1.2 తులాల బంగారు గొలుసును కూడా ఎత్తుకెళ్లిపోయారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టారు. ఓ దివ్యాంగుడు సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. మిగిలిన 12 మంది ఖైదీల కోసం కేరళ సరిహద్దు ప్రాంతాలతో పాటు బస్టాండ్లలో తీవ్రంగా తనిఖీలు చేస్తున్నారు. అలాగే అడవి ప్రాంతాల్లో దాక్కున్న ఖైదీలను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నారు. ఘటన స్థలాన్ని ప్రిజన్స్ డీజీపీ సందీప్ రాయ్ రాథోడ్, సౌత్ జోన్ ఐజీ విజయేంద్ర బిదరి సందర్శించి విచారణ చేపట్టారు.

ఓటు పరిరక్షణ ఉద్యమం కొనసాగిస్తాం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల ఓటు హక్కును హరిస్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పేదల పేర్లను ఉద్దేశపూర్వకంగా ఓట్ల జాబితాల నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు లేదా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనను పదవి నుంచి తొలగించే వరకు ప్రతిపక్షాల ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఢిల్లీలోని త్రిలోక్‌పురిలో మంగళవారం నిర్వహించిన ఓటు హక్కు.. జీవించే హక్కు పేరుతో జరిగిన ప్రజా విచారణ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు ప్రాథమిక హక్కు అని, అయితే ఆ హక్కును క్రమపద్ధతిలో దూరం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పేదల పేర్లను ఓట్ల జాబితాల నుంచి తొలగించడం వల్ల వారు తమ ప్రజాస్వామ్య హక్కులతో పాటు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను పొందే అవకాశాలను కూడా కోల్పోతున్నారని పేర్కొన్నారు. దేశంలోని కొద్దిమంది సంపన్నుల ప్రయోజనాల కోసమే పాలన సాగించే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

కొత్తపేట డివిజన్ మూసీ పరివాహక ప్రాంతంలో దోమల నివారణకు డ్రోన్ స్ప్రే నిర్వహణ

ఎల్బీనగర్ ప్రతినిధి, అక్టోబర్ 27 (వార్త సంధ్య):
కొత్తపేట డివిజన్ పరిధిలో దోమల బెడద తీవ్రంగా పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, నిన్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తూ, దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరడం జరిగింది. ఈ నేపథ్యంలో స్పందించిన ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ పరిధిలోని మూసీ పరివాహక ప్రాంతంలో నాగోల్ బ్రిడ్జి సమీపంలో డ్రోన్ స్ప్రే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పవన్ కుమార్ ప్రత్యక్షంగా పరిశీలించారు. డ్రోన్ ద్వారా ఎంఎల్ఓ ఆయిల్‌ను స్ప్రే చేస్తూ దోమల నివారణకు చర్యలు చేపట్టడం జరిగింది. అదేవిధంగా మూసీ పరివాహక ప్రాంతంలో దోమలకు ఆవాసాలుగా మారుతున్న గుర్రపుడెక్కను తొలగించడం జరిగింది. గుర్రపుడెక్క తొలగించడం ద్వారా దోమలకు అనుకూలమైన ఆవాసాలను తగ్గించడంతో పాటు, దోమల లార్వా వృద్ధిని నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది.ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని డివిజన్‌లోని అన్ని కాలనీలలోనూ క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రం చేయాలని, దోమల లార్వా నివారణకు నిరంతరం తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత ఎంటమాలజీ అధికారులకు, సిబ్బందికి పవన్ కుమార్ సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రాంబాబు డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ జిల్లా నాయకులు సుందర్ నారాయణ సీనియర్ నాయకులు అశ్విన్ సింగ్ ఠాకూర్ కొత్త తిరుమల శరన్ తదితరులు పాల్గొన్నారు

ఎంపీ వద్దిరాజు తన ధర్మపత్ని విజయలక్ష్మీతో కలిసి స్వర్గీయ సుశీలకు ఘనంగా నివాళులర్పించారు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 27. :
బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీతో కలిసి స్వర్గీయ అనసూరి సుశీల చిత్రపటానికి పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు.ఖమ్మం వాస్తవ్యులు అనసూరి పుల్లయ్య సతీమణి సుశీల ఈనెల 17వతేదీన మృతి చెందారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆమె దశదిన కర్మకాండను మంగళవారం బోనకల్ రోడ్డు ధంసలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేశారు.ఈ కార్యానికి రవిచంద్ర- విజయలక్ష్మి దంపతులు హాజరై సుశీల చిత్రపటానికి పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించి,భర్త పుల్లయ్య, కుమారుడు-కోడలు చంద్రశేఖర్-నీరజ, అల్లుడు పుల్లయ్య, కూతుళ్లు-అల్లుళ్లు ఇనుగుర్తి వెంకటేశ్వర్లు-వసంతలక్ష్మి,బాణాల వీరబ్రహ్మాచారి-శ్రీదేవిలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.స్వర్గీయ సుశీల తన కండ్లను దానం చేయగా ఖమ్మం నేత్ర నిధి ఆమె పేరుతో జారీ చేసిన ప్రశంసా పత్రాన్ని చూసి ఎంపీ రవిచంద్ర కుటుంబ సభ్యులను అభినందించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్ ప్రతినిధి, అక్టోబర్ 27 (వార్త సంధ్య):
హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ఎల్‌బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పి అండ్ టీ కాలనీ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమని, ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, రమేష్ ముదిరాజ్, శ్రీశైలం యాదవ్, శైలజ, కొత్త రవీందర్ రెడ్డి, సుధీర్ గౌడ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేము రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామ రైతులం!

గత 50 ఏండ్లుగా సాగుచేసుకుంటున్న 1248 ఎకరాల మా భూములను వక్ఫ్ పేరుతో డేటా సెంటర్ కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకునే కుట్ర చేస్తోందని రైతులు ఆరోపించారు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 28.
సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూరైతులను ఇబ్బందిపెట్టొద్దని గౌరవ హైకోర్ట్ చెప్పినా వినకుండా అధికారులను ఉసిగొల్పి లాక్కునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు
రైతులంతా ప్రెస్ మీట్ పెట్టి
ఈ సమాజానికి మా బాధను చెప్పుకోవడానికి వస్తున్నామని ఆయన చెప్పారు రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని ప్రసంగించారు

విద్యారణ్య స్కూల్ నిర్వాహకుడిపై కేసు నమోదు!

-అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు

-విలేకరిపై తప్పుడు ఫిర్యాదు, పరువుకు భంగం కలిగించేలా వార్త ప్రచురణ జరిగిందంటూ ఫిర్యాదు

-కోర్టు ఆదేశాలతో ఐదు సెక్షన్ల కింద కేసు.. దర్యాప్తు ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 27 (వార్తసంధ్య):
పాఠశాల నిర్వహణకు అవసరమైన అనుమతులపై ప్రశ్నించినందుకు ఓ విలేకరిపై తప్పుడు ఫిర్యాదు చేయడంతోపాటు, ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వార్త ప్రచురింపజేశారన్న ఆరోపణలపై విద్యారణ్య స్కూల్ నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రజా ప్రశ్న న్యూస్ విలేకరి ఓ. సంతోష్ రాజు దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు నాంపల్లిలోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలతో అంబర్‌పేట పోలీసులు క్రైమ్ నంబర్ 569/2026గా కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఐదు సెక్షన్ల కింద కేసు నమోదైన నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అనుమతులు లేకుండానే పాఠశాల నిర్వహణ?

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. అంబర్‌పేటలోని పటేల్‌నగర్, రామంతాపూర్‌లోని వివేక్‌నగర్ ప్రాంతాల్లో సిరిపురం ఉపేందర్ అనే వ్యక్తి విద్యారణ్య స్కూల్‌ను నిర్వహిస్తున్నారని సంతోష్ రాజు ఆరోపించారు. పాఠశాల నిర్వహణకు అవసరమైన గుర్తింపు, అనుబంధ గుర్తింపు, ఇతర అనుమతులు, విద్యాశాఖ అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఉన్నాయా లేదా అనే అంశాలపై ఆయన సందేహాలు వ్యక్తం చేశారు. ఈ విషయాలను నిర్ధారించుకునేందుకు అంబర్‌పేట, ఉప్పల్ మండల విద్యాధికారులను సంప్రదించినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యాసంస్థల నిర్వహణలో అవసరమైన అనుమతులు, నిబంధనల అమలుపై ప్రశ్నించడం తన వృత్తిపరమైన బాధ్యతలో భాగమని ఆయన పేర్కొన్నట్లు ఫిర్యాదు వివరాలు సూచిస్తున్నాయి.

సిరిపురం ఉపేందర్

అయితే, పాఠశాలకు నిజంగా అవసరమైన అనుమతులు లేవా అనే అంశం సంబంధిత విద్యాశాఖ రికార్డుల పరిశీలనతో నిర్ధారణ కావాల్సి ఉంది.

విలేకరిపై తప్పుడు ఫిర్యాదు చేశారంటూ ఆరోపణలు పాఠశాల అనుమతుల వ్యవహారంపై ప్రశ్నించిన తర్వాత నిర్వాహకుడు తనపై కక్ష పెంచుకున్నారని సంతోష్ రాజు ఆరోపించారు. తనను బెదిరించి, వేధించాలనే ఉద్దేశంతో అక్రమ ప్రవేశం, డబ్బుల వసూలు వంటి ఆరోపణలతో తప్పుడు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టుడేస్ న్యూస్' అనే స్థానిక పత్రికలో తనపై అసత్య, తప్పుదోవ పట్టించే ఆరోపణలతో వార్త ప్రచురింపజేసి సామాజికంగా తన ప్రతిష్ఠను దెబ్బతీశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఆ పత్రికకు చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ నంబర్ లేదని కూడా పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఆరోపణలపై సంబంధిత పత్రిక రిజిస్ట్రేషన్ వివరాలను అధికారిక రికార్డుల ద్వారా నిర్ధారించాల్సి ఉంది.

పోలీసులను ఆశ్రయించినా చర్యలు తీసుకోలేదని కోర్టుకు..

తనపై తప్పుడు ఫిర్యాదు చేయడం, పరువుకు భంగం కలిగించేలా వార్తలు ప్రచురించడం, పాఠశాల నిర్వహణపై ప్రశ్నించకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించడం ద్వారా తనను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని సంతోష్ రాజు ఆరోపించారు. ఈ వ్యవహారంపై అంబర్‌పేట పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఫిర్యాదును పరిశీలించిన నాంపల్లిలోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసినట్లు అందిన వివరాలు వెల్లడిస్తున్నాయి.

ఐదు సెక్షన్ల కింద కేసు.. విచారణలో వాస్తవాలు తేలాల్సిందే!

క్రైమ్ నంబర్ 569/2026గా నమోదైన ఈ కేసులో ఐదు సెక్షన్ల కింద చర్యలు చేపట్టినట్లు సమాచారం. అయితే, ఏయే చట్టాలు, సెక్షన్లు వర్తింపజేశారనే వివరాలు ఎఫ్ఐఆర్ ప్రతిని పరిశీలించిన తర్వాతే స్పష్టంగా పేర్కొనవచ్చు. పాఠశాల నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? విలేకరిపై చేసిన ఫిర్యాదులోని ఆరోపణలకు ఆధారాలున్నాయా? ప్రచురితమైన వార్తలోని అంశాలు వాస్తవాలా, అసత్యాలా? అనే విషయాలపై పోలీసుల దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న పాఠశాల నిర్వాహకుడి వివరణను కూడా పరిగణనలోకి తీసుకుని, అందుబాటులో ఉన్న ఆధారాల మేరకు చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంది. విద్యాసంస్థల నిర్వహణలో పారదర్శకత, విలేకరులపై వచ్చే ఫిర్యాదుల విషయంలో నిష్పక్షపాత దర్యాప్తు కీలకం. ఈ కేసులో పూర్తి వాస్తవాలు పోలీసుల విచారణతో వెలుగులోకి రావాల్సి ఉంది.

ఎంపీ వద్దిరాజును కలిసి వినతిపత్రం అందజేసిన నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 27
తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌ఎచ్‌ఎం) ఉద్యోగులకు బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న డాక్టర్లు,ఎఎన్ఎంలు,నర్సులు 15 రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం,పరిష్కారం చూపకపోవడం శోచనీయమన్నారు.కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో చాలా ఏండ్లుగా పని చేస్తున్న తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని,సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న తదితర డిమాండ్లతో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు ఈనెల 13వతేదీ నుంచి ఆందోళన బాటపట్టారు.ఈ సందర్భంగా వారు మంగళవారం ఖమ్మంలో ఎంపీ రవిచంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు.వారి సమస్యలను సావధానంగా విన్న ఎంపీ రవిచంద్ర వెంటనే స్పందించి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఫోన్ చేసి ఉద్యోగుల ఆందోళన,ఆవేదన గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ,ఈ మిషన్ లోని ఉద్యోగులలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారని,జీతంతో కూడిన 8నెలల ప్రసూతి సెలవులు కోరడం న్యాయబద్ధమైనదేనన్నారు.ఈ జాతీయ మిషన్ లో 60 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానిది కాగా,40% రాష్ట్రానిదని, వీరికి ఆరోగ్య బీమా కల్పించకపోవడం,ఇఎచ్ఎస్ కార్డులు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఇంక్రిమెంట్లను,8 శాతం లాయాలిటీ బోనస్ తదితర ప్రయోజనాలను కూడా కాంగ్రెస్ సర్కార్ చెల్లించకపోవడం విచారకరమన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్పగా ప్రకటించడమే తప్ప ఏ మాత్రం కూడా ఆచరణలో చూపడం లేదనడానికి,వీరు ఎదుర్కొంటున్న సమస్యలే నిదర్శనమన్నారు.తాను త్వరలో కేంద్ర ఆరోగ్య శాఖ జే.పీ.నడ్డాను స్వయంగా కలిసి ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల గురించి వివరించి పరిష్కరిస్తానని ఎంపీ వద్దిరాజు వారికి హామీనిచ్చారు.ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయన్ను శాలువాతో సత్కరించి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

మునుగోడు నీటి కష్టాలకు మోక్షం..

- కృష్ణా జలాల కోసం ఎమ్మెల్యే కృషి ఫలితం!

-శివన్నగూడెం ప్రాజెక్టుకు ఏదుల నుంచి నీటి లితరలింపునకు ప్రభుత్వ ఆమోదం

-రూ .1,800 కోట్లతో నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు

మునుగోడు,: అక్టోబర్ -27 (వార్త సంధ్య)
మునుగోడు ప్రాంతాన్ని కృష్ణా జలాలతో సస్యశ్యామలం చేయడంతో పాటు, ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు పడిందని కాంగ్రెస్ పార్టీ మునుగోడు మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు తెలిపారు. ఏదుల రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షణీయమని పేర్కొన్నారు.మంగళవారం మునుగోడు మండల కేంద్రంలోని చౌరస్తాలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి తరలింపు ప్రతిపాదనకు ఆమోదం లభించడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా భీమనపల్లి సైదులు మాట్లాడుతూ.. మునుగోడు ప్రాంతంలో తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని అన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు ప్రభుత్వం రూ. 1,800 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో నీటి సమస్యలు తగ్గడంతో పాటు రైతులకు సాగునీటి భరోసా లభించే అవకాశం ఉందన్నారు.ఏళ్ల తరబడి ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నీటి వనరులు అందుబాటులోకి వస్తే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడంతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషికి ఈ నిర్ణయం నిదర్శనమని అన్నారు.కృష్ణా జలాలు ఈ ప్రాంతానికి చేరి ప్రాజెక్టు లక్ష్యం నెరవేరితే రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. నీటి తరలింపు పనులు త్వరితగతిన ముందుకు సాగి ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు బూడిద లింగయ్య యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పాలకూరి యాదయ్య గౌడ్, మాజీ ఎంపీపీ మేడి నాగలక్ష్మి యాదయ్య, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి, సర్పంచులు, పాలకూరి రమాదేవి నరసింహ, తీర్పారి నాగమణి ఆంజనేయులు , దాసరి గోవర్ధన్, చీమల రాజు, మాజీ సర్పంచులు తాటికొండ సైదులు యాదవ్, జాల వెంకన్న, మాదగోని రాజేష్ గౌడ్, అప్పారావు పోలగోని ప్రకాష్ గౌడ్ , ఎండి అన్వర్, ముచ్చపోతుల శ్రీను ,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతి కేసులో తారా ఆసుపత్రిలో డీఎంహెచ్‌ఓ విచారణ!

- తనిఖీలతోనే సరిపెడతారా? బాధ్యులపై చర్యలు తీసుకుంటారా?
- 14 ఏళ్ల బాలుడి మృతిపై వైద్య ఆరోగ్యశాఖ దర్యాప్తు.. తాత్కాలిక అనుమతులపైనా పరిశీలన
- వైద్య నిర్లక్ష్యం ఉందా? ఆసుపత్రి నిబంధనలు పాటించిందా? నివేదికపై ఉత్కంఠ

ఆదిభట్ల, అక్టోబర్ 27 (వార్తసంధ్య): రంగారెడ్డి జిల్లా పరిధిలోని బ్రాహ్మణపల్లి చౌరస్తాలో ఉన్న తారా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో 14 ఏళ్ల బాలుడు మృతి చెందిన ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టారు. బాలుడికి అందించిన చికిత్సలో నిర్లక్ష్యం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆసుపత్రిని తనిఖీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, అధికారుల తనిఖీలతోనే ఈ వ్యవహారం ముగుస్తుందా? బాలుడి మృతికి కారణాలేమిటో నిర్ధారించి, బాధ్యులుగా తేలిన వారిపై చర్యలు తీసుకుంటారా? అనే ప్రశ్నలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలు చేశారు.. తదుపరి చర్యలు ఎప్పుడు?

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం తారా ఆసుపత్రిని తనిఖీ చేశారు. బాలుడికి అందించిన చికిత్సకు సంబంధించిన వైద్య రికార్డులు, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, అనుమతులకు సంబంధించిన వివరాలను పరిశీలించినట్లు సమాచారం. ఆసుపత్రికి ప్రస్తుతం తాత్కాలిక అనుమతులు మాత్రమే ఉన్నాయని అధికారులు వెల్లడించినట్లు తెలిసింది. అయితే, ఆ అనుమతుల పరిధి ఏమిటి? ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన అన్ని నిబంధనలు అమలవుతున్నాయా? అందిస్తున్న వైద్య సేవలకు అనుగుణంగా అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. తనిఖీల్లో సేకరించిన వివరాల ఆధారంగా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది కీలకంగా మారింది. బాలుడి మృతికి సంబంధించిన అంశాన్ని కేవలం సాధారణ తనిఖీగా పరిగణించకుండా, వైద్యపరమైన కోణంలోనూ సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

వైద్యుల నేమ్‌బోర్డులు ఎక్కడ? నిబంధనలు పాటిస్తున్నారా?

ఆసుపత్రిలో వైద్యుల పేర్లు, వారి హోదాలకు సంబంధించిన వివరాలు స్పష్టంగా ప్రదర్శించలేదని అందిన సమాచారం ఆధారంగా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. వైద్యుల అర్హతలు, వారి విధులు,

వైద్యుల పేర్లు వారి హోదా తో ఉండవలసిన నేమ్ బోర్డులో పేర్లు లేకపోవడం హాస్పిటల్ యాజమాన్యం యొక్క నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది ఈ దృశ్యం .

ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది వివరాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. వైద్యుల పేర్లు, అర్హతలు, హోదాలకు సంబంధించిన వివరాలను ప్రదర్శించడంపై వర్తించే నిబంధనలు పాటించారా లేదా అన్నది అధికారికంగా నిర్ధారించాలి. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే, వాటి తీవ్రతను బట్టి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, నేమ్‌బోర్డుల అంశం ఒక్కటే బాలుడి మృతికి కారణమని చెప్పలేం. మరణానికి దారితీసిన వైద్య పరిస్థితులు, చికిత్సలో అనుసరించిన విధానం, ఆసుపత్రి సదుపాయాలు, అవసరమైన సమయంలో ఉన్నత వైద్య సేవలకు తరలించే ఏర్పాట్లు వంటి అంశాలను కూడా వైద్య నిపుణుల సహాయంతో పరిశీలించాలి.

బాలుడి మృతికి అసలు కారణం ఏమిటి?

బాలుడికి అందించిన చికిత్సలో ఏవైనా లోపాలు జరిగాయా? వైద్యులు నిర్దేశిత వైద్య ప్రమాణాలను అనుసరించారా? చికిత్సలో ఆలస్యం జరిగిందా? అవసరమైన వైద్య పరీక్షలు, అత్యవసర సేవలు అందించారా? ఆసుపత్రి వద్ద అందుబాటులో లేని సదుపాయాల అవసరం ఏర్పడినప్పుడు సరైన చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నలకు విచారణలో సమాధానాలు లభించాలి. బాలుడి వైద్య రికార్డులు, చికిత్స వివరాలు, పరీక్షల నివేదికలు, విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది వివరాలు, అవసరమైతే నిపుణుల వైద్య అభిప్రాయాలను పరిశీలించడం ద్వారా వాస్తవాలను నిర్ధారించవచ్చు. మరణానికి వైద్య నిర్లక్ష్యం కారణమైందా లేదా అన్నది ఆధారాల మేరకు తేల్చాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు తీవ్రమైనవి కావడంతో విచారణ పారదర్శకంగా సాగడం అవసరం. అదే సమయంలో, దర్యాప్తు పూర్తికాకముందే ఆసుపత్రి యాజమాన్యాన్ని లేదా వైద్యులను దోషులుగా నిర్ధారించడం సరికాదు. ఆరోపణలు నిర్ధారణ అయితే సంబంధిత చట్టాలు, వైద్య నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

రెండు రోజుల్లో విచారణ వివరాలు వెల్లడిస్తామని హామీ!

ఈ ఘటనపై రెండు రోజుల్లో విచారణ వివరాలు వెల్లడిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ప్రకటించినట్లు అందిన సమాచారం చెబుతోంది. నిబంధనల ఉల్లంఘనలు లేదా వైద్యపరమైన నిర్లక్ష్యం నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఆసుపత్రిని సీజ్ చేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తామని ఆయన తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధికారులు ప్రకటించిన గడువులో విచారణ వివరాలు వెల్లడిస్తారా? ఆసుపత్రి అనుమతులకు సంబంధించిన అంశాలపై స్పష్టత ఇస్తారా? బాలుడి మృతికి దారితీసిన పరిస్థితులను నిర్ధారిస్తారా? అనే విషయాలపై బాధిత కుటుంబం, స్థానికులు ఎదురుచూస్తున్నారు. తనిఖీల్లో డీఈఎంఓ మంజుల, మండల వైద్యాధికారి ప్రియాంక, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నట్లు సమాచారం.

తనిఖీలే కాదు.. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి!

ఒక బాలుడి మృతి వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి రావడం అత్యంత ముఖ్యం. విచారణ నివేదికను సిద్ధం చేయడం, అవసరమైన ఆధారాలను సేకరించడం, ఆరోపణలను నిర్ధారించడం, బాధ్యత వహించాల్సిన వారిని గుర్తించడం వంటి అంశాలపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించాలి. తనిఖీలతోనే సరిపెడతారా? బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? అన్న ప్రశ్నకు అధికారుల తదుపరి నిర్ణయమే సమాధానం చెప్పాలి. ఆసుపత్రి నిర్వహణలో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే వాటిపై చర్యలు తీసుకోవడంతో పాటు, బాలుడి మృతికి సంబంధించి వైద్యపరమైన వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలంటే విచారణ నిష్పక్షపాతంగా, ఆధారాల ఆధారంగా సాగాలి. బాలుడి మృతికి అసలు కారణం ఏమిటో స్పష్టత రావడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టడం వైద్య ఆరోగ్యశాఖ ముందున్న కీలక బాధ్యత.

ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు!

- ధ్రువపత్రాల పరిశీలన పక్కాగా జరగాలి.. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయాలి
- నల్లగొండ జిల్లా ఓటరు జాబితా ఎన్నికల పరిశీలకురాలు దేవసేన

మునుగోడు, :అక్టోబర్ -27 (వార్త సంధ్య): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని నల్లగొండ జిల్లా ఓటరు జాబితా ఎన్నికల పరిశీలకురాలు, రాష్ట్ర కళాశాల సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన అధికారులకు సూచించారు. ఓటర్ల వివరాల నిర్ధారణ, ధ్రువపత్రాల పరిశీలనలో అప్రమత్తంగా వ్యవహరించాలని, నిబంధనలకు అనుగుణంగా నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులు చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం మునుగోడు మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 171వ పోలింగ్ కేంద్రాన్ని దేవసేన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)తో మాట్లాడి ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలన,

నోటీసుల జారీ, ధ్రువపత్రాల తనిఖీ, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో నిర్ధారించాలని సూచించారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, సంబంధిత వివరాలను పూర్తిగా పరిశీలించి, నిబంధనల ప్రకారం ఒకే చోట ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతోపాటు, అనర్హమైన నమోదు లేదా తప్పుల వల్ల ఎవరికీ ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పరిశీలన అనంతరం సంబంధిత ఓటర్ల ఇళ్లకు వెళ్లి వారి పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా అనే విషయాన్ని తెలియజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వివరించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వం పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జై శ్రీనివాస్, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ తియాన్ మావి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు తహసీల్దార్ నేలపట్ల నరేష్, ఎంఈఓ తల్లమల్ల మల్లేశం, ఆర్ఐ, తదితరులు పాల్గొన్నారు.

చిన్న సినిమాలకు థియేటర్లేవీ?

- 'ఓ అందాల రాక్షసి' విడుదలకు అడ్డంకులు..
- సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని హీరో, దర్శకుడు షిరాజ్ మెహదీ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 27. తెలుగు చిత్ర పరిశ్రమలో చిన్న సినిమాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని హీరో, దర్శకుడు షిరాజ్ మెహదీ ఆవేదన వ్యక్తం చేశారు. తాను రూపొందించిన 'ఓ అందాల రాక్షసి' చిత్రానికి థియేటర్లు కేటాయించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. చిన్న సినిమాలకు ప్రాధాన్యం కల్పించకపోవడంతో నిర్మాతలు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని అఆ సినీ స్టూడియోస్‌లో తన పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన వేడుకలు, విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగైదేళ్లుగా చిన్న సినిమాలకు థియేటర్లు లభించడం కష్టంగా మారిందని, వంద సినిమాలు విడుదలైతే రెండు మూడు చిత్రాలకే అధిక ప్రాధాన్యం దక్కుతోందని ఆరోపించారు. తన సినిమాకు ఆడియో, ఓటీటీ, శాటిలైట్, ఇతర భాషల హక్కుల విషయంలోనూ ఆశించిన అవకాశాలు రాలేదన్నారు. చిన్న సినిమాల సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫిల్మ్ ఛాంబర్ నుంచి సరైన స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాదిన్నరగా ఒంటరిగానే పోరాటం చేస్తున్నానని, చిన్న నిర్మాతలకు న్యాయం జరిగే వరకు తన ప్రయత్నం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఊటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, దుబాయ్‌లో హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ అభ్యసించిన అనంతరం దర్శకత్వంలో శిక్షణ తీసుకుని సినీ రంగంలోకి వచ్చినట్లు షిరాజ్ మెహదీ తెలిపారు. 'పాడుచీకటి', 'కేఎస్ 100', 'యు ఆర్ మై హీరో', 'పౌరుషం', 'ఓ అందాల రాక్షసి' చిత్రాలతో తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. చిన్న సినిమాలకు థియేటర్ల కేటాయింపు, విడుదల, ఓటీటీ, శాటిలైట్ హక్కుల సమస్యలను పరిష్కరించేలా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చిన్న నిర్మాతలకు సమాన అవకాశాలు కల్పించే విధానపరమైన మార్పులు తీసుకురావాలని కోరారు.

బండి రమేష్ సమక్షంలో కూకట్‌పల్లి నియోజకవర్గం మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా షేక్ నవాజ్ బాధ్యతల స్వీకరణ

వార్త సంధ్య కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా నియమితులైన షేక్ నవాజ్ ఘనంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగ జనతా నగర్ లోని తన నివాసం నుంచి కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరి, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమదుర్గా భవన్‌కు చేరుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టి పి సి సి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లి బండి రమేష్‌లి సమక్షంలో షేక్ నవాజ్ కూకట్‌పల్లి నియోజకవర్గ మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్బంగ బండి రమేష్ మాట్లాడుతు కాంగ్రెస్ పార్టి అంటేనే అన్ని వర్గాలకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించే పార్టి మైనారిటీ సోదరుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టి ఎప్పుడూ ముందుంటుంది అని ప్రతి ఒక్కరికీ రాజకీయంగా ఎదిగే అవకాశం కాంగ్రెస్ పార్టి కల్పిస్తుంది అని షేక్ నవాజ్ కి అప్పగించిన పదవి, బాధ్యత సమర్థవంతంగ నిర్వహిస్తు, మైనారిటీ సోదరుల సమస్యలను గుర్తించి, వారి గొంతుకగా నిలుస్తారని అన్నారు ఈ సందర్బంగ షేక్ నవాజ్ మాట్లాడుతు ఈరోజు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం నాకు ఎంతో సంతోషంగ ఉంది. నాపై నమ్మకం తో ఈ బాధ్యత ను అప్పగించిన బండి రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు బండి రమేష్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటు అంకితభావంతో పని చేస్తాను అని అన్నారు ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా వర్ఫ్ బోర్డు మెంబెర్ అడ్వకేట్ హుస్సేన్, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టి జిల్లా ఉపాధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్, మైనారిటీ చైర్మన్ ఎండీ చున్ను పాషా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సలీం రాష్ట్ర ఓబిసి వర్కింగ్ చైర్మన్ తూము వినయ్, కాంగ్రెస్ నాయకులు పులి శివా, సప్పిడి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు తూము సంతోష్, కాలికోట శంకర్, రాజేష్ గౌడ్, మైనారిటీ వైస్ చైర్మన్ ఎండీ నయీమ్, కాంగ్రెస్ నాయకులు రమణ, అక్బర్, మల్లేష్ యాదవ్, అస్లాం, తూము సచిన్, ఎండీ యూసఫ్ పాషా, కాంగ్రెస్ పార్టి అన్ని విభాగాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని షేక్ నవాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పదవీ స్వీకార కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ ఆత్మీయ విందు షేక్ నవాజ్ ఏర్పాటు చేయడం జరిగింది

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో మెడల్ సాధించిన నాడికుడి శివానిని అభినందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

వార్త సంధ్య కూకట్‌పల్లి: కూకట్‌పల్లికి చెందిన నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని నాడికుడి శివాని రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో రెజ్లింగ్ విభాగంలో 57 కేజీల కేటగిరీలో బంగారు పతకం సాధించిన సందర్భంగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివానిని రాజేశ్వరరావు అభినందించి, ఆశీర్వదించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి, తన తల్లిదండ్రులతో పాటు కూకట్‌పల్లి ప్రాంతానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి కొడిచర్ల వినోద్ కుమార్, ఖైతలాపూర్ డివిజన్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

స్టార్‌లింక్ మనకు అవసరమా!

మన దేశంలో తన టెలీ కమ్యూనికేషన్ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్న ఎలాన్ మస్క్‌కు కోపమొచ్చింది. పట్టరాని ఆక్రోశంతో రిలయన్స్ చైర్మన్ ముఖేశ్ అంబానీపై ఎత్తిపొడుపు మాటలు సంధించారు. భారత్ మార్కెట్ లోకి తన స్పేస్‌ఎక్స్‌కు చెందిన స్టార్ లింక్ వ్యవస్థ ప్రవేశానికి జరుగుతున్న జాప్యానికి ముఖేశ్ కారణమనే భావనతో మస్క్ ఆయనను 'ఇండియాకు నిజమైన అధిపతి, ప్రైమ్ మినిష్టర్ అంబానీ' అంటూ సంబోధిస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'తమరే ఇండియాకు నిజమైన బాస్ అని నేను ఇంతకాలం గుర్తించలేక పోయినందుకు నన్ను క్షమించు. స్టార్‌లింక్‌ను పోటీలోకి రాకుండా చేసి, ఒక్కడివే ఈ దేశ ప్రజల సొమ్మును పొందాలని చూస్తున్నావు. ఇలా చేయడం భారత ప్రజలపట్ల నేరపూరితమే. అయినా స్టార్ లింక్ రాకుండా చేయడం సాధ్యమా?' అని ఎలాన్ పోస్టులో ఉంది. దేశంలో అత్యధిక ఇంటర్‌నెట్ కనెక్షన్స్ ఉన్న జియోకు ముఖేష్ అంబానీ యజమాని అని తెలిసిందే! అంతేకాకుండా దేశ ప్రధాని నరేంద్ర మోడీతో ఆయనకున్న అనుబంధం కూడా లోకవిదితమే! అందుకే అంత తెగింపుగా ఎలాన్ మస్క్ పోస్టు పెట్టగలిగారు. మస్క్ మాటలను కేంద్ర సమాచార శాఖ ఖండిస్తూ– సాటిలైట్ కమ్యూనికేషన్ నిబంధనలు అందరికీ సమానమే, ఇందులో ఎలాంటి పక్షపాత ధోరణి లేదని ప్రకటించింది. అంబానీ గాని, రిలయెన్స్ సంస్థ గాని ఆయన వాదనపై స్పందించలేదు. స్టార్ లింక్ ఇప్పటికే 165 దేశాల నుండి లైసెన్స్ పొంది ఉంది. 2021 లోనే మన దేశం నుండి కూడా కీలక అనుమతులు లభించాయి. అయినప్పటికీ అయిదేళ్లుగా వ్యాపార ప్రవేశానికి భారత ప్రభుత్వం పచ్చ జెండా చూపకపోవడం ఆయనకు ఇబ్బందికరంగా ఉంది. వాస్తవాల్లోకి వెళితే స్టార్‌లింక్ అంతరిక్ష వ్యవస్థను వాడుకొని భారత్‌లో కలిసి వ్యాపారం చేద్దామని జియో, ఎయిర్ టెల్ సంస్థలు స్పేస్‌ఎక్స్ తో 2025 లోనే ఒప్పందం చేసుకున్నాయి. విదేశీ సంస్థ కలిసి ఉన్నందున భారత ప్రభుత్వం సమాచార భద్రతా దృష్ట్యా వీరి ప్రతిపాదనను పక్కన పెట్టింది. దీనిపై ఆశలు వదులుకున్న జియో, ఎయిర్ టెల్ సొంతంగా సాటిలైట్ కమ్యూనికేషన్‌ద్వారా దేశంలో సేవలు అందించాలని పోటీపడుతున్నాయి. జియో, ఎయిర్ టెల్‌తో కలిసి భారత్‌లో పాగా వేద్దామనుకున్న ఎలాన్ మస్క్ కలలు నెరవేరలేదు. నమ్మించి వంచించారనే కోపంతో ఆయన అంబానీపై అలా విరుచుక పడ్డారు. దేశంలో శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలపై ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో కలిసిన ఈ మూడు కంపెనీల ప్రతినిధుల మధ్య ఈ విషయం చర్చకు వచ్చింది. తాము సొంతంగా సాటిలైట్ సమాచార వ్యవస్థను వృద్ధి చేసుకొని, రెగ్యులేటరీ అనుమతిని కోరుతామని ఆకాశ్ అంబానీ అన్నారు. ప్రభుత్వం అనుసమతుల స్థాయిలో తామున్నామని సునీల్ భారతీ మిట్టల్ చెప్పారు. ఈ దేశ అవసరాలకు తగ్గట్టుగా కొన్నేళ్లుగా శ్రమించి తాము రెగ్యులేటర్లు, సెక్యూరిటీ కంట్రోల్ వ్యవస్థలను ఇప్పటికే నిర్మించామని స్పేస్ ఎక్స్ ప్రతినిధి అన్నారు. ఈ లెక్కన ఎలాన్ మస్క్ మన ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వ్యాపారపరంగా అన్ని సమకూర్చి పెట్టుకున్నారు. పరిస్థితులు ఆశాజనకంగా కనబడక ఆయన కోపం పెరిగిపోతోంది. దేశ సమాచార భద్రత దృష్ట్యా స్టార్ లింక్ విషయంలో ప్రభుత్వం రాజీపడేందుకు సిద్ధంగా లేదు. రెండేళ్ల క్రితం అండమాన్, నికోబార్ దీవుల్లో మాదకద్రవ్యాల విచారణలో, మణిపూర్ ఆందోళనకారుల వద్ద స్టార్ లింక్ సాంకేతిక పరికరాలు దొరకడం అధికారులకు ఆందోళన కలిగించింది. అయితే అవి నిర్మాణాలు జరుగుతున్నప్పుడు వదిలేసిన వస్తువులు కావచ్చు, సమాచార సేవలు మొదలు కానప్పుడు వాటి వల్ల ఆందోళన చెందే అవసరమే లేదని మస్క్ సమాధానం ఇచ్చారు. దేశానికి, పౌరులకు సంబంధించిన ఏ డేటా పొలిమేరలు దాటదని ఆయన మరోసారి హామీ ఇచ్చారు. తమకు అవకాశమిస్తే ఇంటర్‌నెట్ వేగాన్ని పెంచి, నెట్ అందుబాటులోని వారికి తక్కువ ధరలో అందజేస్తానని అంటున్నారు. ప్రస్తుతం అమెరికాలో స్టార్ లింక్ సేవలకు కనీసం నెలకు 55 డాలర్లు వసూలు చేస్తున్నారు. భారతీయులు అది భారమౌతుందని కూడా ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతమున్న ఇంటర్ నెట్ వ్యవస్థ టవర్స్ ఆధారంగా నడుస్తోంది. సాటిలైట్ నుండి టవర్‌కు చేరిన సిగ్నల్ కేబుల్ ద్వారా మోడెమ్‌కు అందుతుంది. మొబైల్‌కు కూడా టవర్ ద్వారానే సిగ్నల్ చేరుతుంది. ఇంటర్ నెట్ వ్యవస్థ అంతా కేబుల్ ఆధారంగా సాగుతోంది. టవర్స్ నిర్మించలేని చోట ఇంటర్ నెట్ అందించలేని పరిస్థితి ఇప్పుడు మన దేశంలో ఉంది. మన దేశంలోని గ్రామీణ, అటవీ, పర్వత ప్రాంతాల్లోకి ఇంకా ఇంటర్ నెట్ చేరలేదు. జనసంఖ్య తక్కువ, నిరక్షరాస్యత, పేదరికం మూలంగా ఆ ప్రాంతాల్లో తగిన బిజినెస్ దొరకదని ఏ కంపెనీలు టవర్ల నిర్మాణం, కేబుల్ ఏర్పాట్లు చేయడం లేదు. ఎలాంటి టవర్లు, కేబుల్ తవ్వకాలు అవసరం లేకుండా సరాసరి సిగ్నల్ అందించే సదుపాయం సాటిలైట్ కమ్యూనికేషన్ ద్వారా ఉంది. సాటిలైట్ ఆధారిత సేవల ద్వారా ఈ మారుమూల ప్రాంతాలకు కూడా ఇంటర్ నెట్ అందించవచ్చు. ఈ సదుపాయం మన దేశానికి అవసరమే. అయితే లాభమేమో కానీ, ముందుగా ఎంతో ఖర్చుతో కూడుకున్నదని దేశీయ సంస్థలేవి ముందుకు రాలేదు. రష్యా, చైనా దేశాలు సొంతంగా సాటిలైట్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. అయితే అదే అదునుగా ఎలాన్ మస్క్‌కు ముందుకొచ్చారు. ఇప్పటికే దేశంలో విదేశీ సంస్థ అయిన వోడాఫోన్ తమ సేవలు అందిస్తోంది. చైనాకు చెందిన కొన్ని యాప్‌ల వల్ల దేశ భద్రతా సమాచారం బయట పడుతోందని టిక్‌టాక్ లాంటి వాటిని ప్రభుత్వం నిషేధించింది. విదేశీ సమాచార సంస్థలు దేశంలో పని చేయకూడదని కోరుకుంటున్న సమయంలో మస్క్ కు లైసెన్స్ ఈయడం ప్రభుత్వం తొందరపాటే అవుతుంది. నెట్ వర్క్ పనులన్నీ పూర్తి చేసుకున్నాక స్టార్ లింక్ సేవలకు అనుమతి ఈయకపోవడం కూడా ఇబ్బందికరమే. ఇంతటితో ఎలాన్ మస్క్ శాంతిస్తాడా, ఆయనకు ఇప్పటికే ఇచ్చిన అనుమతులను రద్దు చేసేందుకు ప్రభుత్వం ఎలా అడుగులు వేస్తుందో చూడాలి.

'అరుణాచల్ ప్రదేశ్'కు అగ్నిపరీక్ష

అరుణాచల్ ప్రదేశ్‌లోని తూర్పు సియాంగ్ జిల్లాలో 11,200 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదించడం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనలకు దారి తీస్తోంది. టిబెట్ లోని ఎగువ ప్రాంతంలో 60,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన భారీ జలవిద్యుత్ ప్రాజెక్టును చైనా నిర్మిస్తోంది. ఇది నదీ తీరప్రాంత దేశమైన భారత్‌కు సవాలు విసురుతోంది. వరదలు ముంచుకు రావడంతోపాటు అనేక ప్రాంతాలు జలమయమవుతాయి. అందుకనే అరుణాచల్‌ప్రదేశ్ సియాంగ్ ప్రాజెక్టును తలపెట్టింది. గత సెప్టెంబర్‌లో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఈ ప్రాజెక్టు చేపట్టాలని తీర్మానించింది. ఈ మేరకు ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక రూపకల్పనకు సంబంధించిన కార్యకలాపాలు స్థానిక ప్రజల్లో ఆందోళనలను రేకెత్తించాయి. ఈ ప్రాజెక్టు వల్ల 27 గ్రామాలు మునిగిపోతాయని, సుమారు 1.5 లక్షల మంది తమ ఇళ్లువాకిళ్లు, పంటపొలాలు, చారిత్రక ప్రదేశాలు సర్వం జలమయమవుతాయని ప్రజలు అభ్యంతరాలను లేవదీస్తున్నారు. కానీ ప్రభుత్వం ప్రజల ఆందోళనలను పరిష్కరించడానికి బదులు సైనిక బలగాలను మోహరించడం, కొందరిని అరెస్టు చేయడంతో ఆందోళనలు మిన్నుముట్టాయి. ఇటీవలి కాలంలో టిబెట్‌లో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలను ఉదాహరణగా చూపిస్తూ ప్రాజెక్టు వల్ల అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా ప్రకృతి వైపరీత్యాలు తప్పవని ప్రజలు భయపడుతున్నారు. పర్యావరణ పరంగా అరుణాచల్ ప్రదేశ్ అత్యంత సున్నితమైన ప్రదేశం. అందువల్ల భారీ ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు పర్యావరణ పరిరక్షణ అంశాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. కానీ ఇలాంటి అంశాలను పట్టించుకోకుండా ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏకపక్ష ధోరణిలో తన ఆనకట్ట నిర్మాణం సాగిస్తోంది. వాస్తవాధీన రేఖ వెంబడి చైనా తన గ్రే జోన్ వ్యూహాలను ఇంకా కొనసాగిస్తోంది. అంటే పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయకుండా ఒత్తిడి పెంచే చర్యల ద్వారా భారత్‌కు సవాలు విసురుతోంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో భారత్, చైనా సైనికుల మధ్య తరచుగా ముఖాముఖి సంఘర్షణలు, ప్రతిష్టంభనలు చోటు చేసుకుంటున్నాయని, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) డైరెక్టర్ జనరల్ ఇటీవల ధ్రువీకరించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అరుణాచల్ ప్రదేశ్‌ను తన భూభాగంగా చైనా పేర్కొంటూ దానిని దక్షిణ టిబెట్‌గా పిలుస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ తన మౌలిక సదుపాయాల అభివృద్ధిని, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, రవాణా వ్యవస్థలు, ఇతర వ్యూహాత్మక నిర్మాణాలను మరింత వేగంగా పూర్తి చేయడం తప్పనిసరి. అయితే అరుణాచల్ ప్రదేశ్ లోని సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవడం, వారి ఆందోళనలను పరిష్కరించడం, ప్రాజెక్టు ఎందుకు చేపట్టవలసి వచ్చిందో ప్రజలకు వివరించడం, ఎలాంటి నష్టాలు సంభవించవని భరోసా ఇవ్వడం ఇవన్నీ ప్రభుత్వ బాధ్యతలు. సరిహద్దునున్న ప్రజలు దేశానికి మొదటి రక్షణ కవచంగా ఉండడమే కాకుండా, తమ భూమికి సంరక్షకులు. సాయుధ దళాలకు వీరి మద్దతు చాలా అవసరం. కానీ ప్రజలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న కార్యకర్తలను అరెస్టు చేయడం మరింత ఉద్రిక్తతలకు దారితీసింది. గత రెండు మూడు రోజులుగా నిరసనలు హింసాకాండకు దారితీశాయి. హింస ప్రభావిత జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం కూడా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ సుమారు 250 మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు (ఆర్ఎఎఫ్) సిబ్బందిని విమానం ద్వారా ముంబై నుంచి అరుణాచల్ ప్రదేశ్‌కు తరలించింది. తూర్పు సియాంగ్ జిల్లా ప్రధాన కేంద్రం పాసీఘాట్‌లో ఆర్‌పిఎఫ్ సిబ్బందిని మోహరింప చేశారు. ఇప్పటికే హింస ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్సుకు చెందిన అనేక బృందాలు మోహరించి ఉన్నాయి. శుక్రవారం రాత్రంతా నిరసనకారులు విధ్వంసకాండ సాగించారు. జాతీయ జలవిద్యుత్ సంస్థ (ఎన్‌హెచ్‌పి) కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌లో పార్కు చేసిన అనేక వాహనాలను తగుల బెట్టారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కాలింగ్ మోయోంగ్, మరో ఇద్దరు ఎంఎల్ఎల ఇళ్లను ధ్వంసం చేశారు. భద్రతాధికారులతో సంఘర్షణకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమాఖండ్ ప్రాంతీయ గిరిజనవర్గాల తోను, ఇతర సామాజిక వర్గా లతోను ఆదివారం చర్చలు జరిపారు. ప్రాజెక్టుపై తప్పుడు సమాచారం, దురభిప్రాయాలు వ్యాప్తి చెందుతున్నాయని, వాటిని నమ్మవద్దని సూచించారు. సియాంగ్‌లోయ ప్రజల ఆకాంక్షలకు, హక్కులకు ఎలాంటి నష్టం జరగదని, అలాగే జాతీయ ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టకోవాలని సూచించారు. కానీ నిరసనకారులు తమ డిమాండ్లను నెరవేర్చాలని పట్టుపడుతున్నారు. జలవిద్యుత్ ప్రాజెక్టును రద్దు చేయాలని, మోహరించి ఉన్న సాయుధ దళాలను తిరిగి వెనక్కు పంపాలని, అరెస్టయిన పదిమంది నిరసనకారులను తక్షణం విడుదల చేయాలని, సస్పెండైన విలేజీ చీఫ్‌లను తిరిగి నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. సియాంగ్ ప్రాంత ప్రజల ఆందోళనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైతే ఇది ఇతర సమస్యలకు దారి తీస్తుంది. ప్రజల్లో పెల్లుబుకుతున్న నిరసనను తమ ప్రయోజనాలకు అనువుగా ఉపయోగించుకోవడానికి వ్యతిరేక శక్తులకు అవకాశం కల్పించినట్టు అవుతుంది. దేశ భద్రత, అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థానిక ప్రజల ప్రయోజనాలు ఈ నాలుగింటి మధ్య సమతుల్యత పాటిస్తూ సియాంగ్ డ్యామ్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లక తప్పదు.

ఎల్‌నినో.. సామాన్యుడిపైనే భారం

వర్షాలు తగ్గితే చెరువులు, జలాశయాలు ఎండిపోవడమే కాదు.. పంటలు తగ్గుతాయి, పశు గ్రాసం కరువవుతుంది, నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. చివరికి నెల జీతంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే ఉద్యోగి నుంచి రెక్కల కష్టాన్ని నమ్ముకున్న పల్లె పేద వరకు అందరి బతుకులూ భారమవుతాయి. ప్రకృతి ప్రకోపానికి అందరూ బాధితులే అయినా, ఆ భారాన్ని భరించే శక్తి మాత్రం అందరికీ ఒకేలా ఉండదు. సూపర్ ఎల్‌నినో సృష్టిస్తున్న సంక్షోభంలో కనిపిస్తున్న అసమానత ఇదే! ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వర్షపాతం దీర్ఘకాలిక సగటులో సుమారు 87 శాతానికే పరిమితమైంది సాధారణం కంటే 12.6 నుంచి 15% వరకు తక్కువ వర్షాలు నమోదయ్యాయి. 2001 తర్వాత అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన సంవత్సరాల్లో ఇది నాలుగోది. ఎల్‌నినో ప్రభావం అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య తీవ్రస్థాయికి చేరి, 2027 ఆరంభం వరకు కొనసాగవచ్చన్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అంటే రుతుపవనాల వైఫల్యంతో మొదలైన కష్టాలు చలికాలంతో ముగిసిపోతాయన్న భరోసా లేదు. నేలలో తేమ తగ్గడం, జలవనరులు అడుగంటడం, పంటల దిగుబడులు పడిపోవడం వంటి పరిణామాలు నిత్యావసరాల ధరలను మరింత పెంచవచ్చు. వర్షాభావం వ్యవసాయాన్ని దెబ్బతీస్తే దాని ప్రభావం పొలాలకే పరిమితం కాదు. ఖరీఫ్ దిగుబడులు లోటు వర్షపాతం సంవత్సరాల్లో సగటున 6.5%, ఎల్‌నినో ప్రభావిత సంవత్సరాల్లో 8.4% వరకు తగ్గుతున్నట్టు అంచనాలున్నాయి. ఈసారి ఆహార ధాన్యాలు, నూనెగింజల సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే 1.2 శాతం తగ్గింది. వరి సాగు విస్తీర్ణం ప్రారంభ దశలోనే 15 లక్షల హెక్టార్లకు పైగా తగ్గడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. సరఫరా తగ్గితే ధరలు పెరుగుతాయి. ఇప్పటికే ఇరవై రోజుల వ్యవధిలో చక్కెర ధరలు 10.16 శాతం, పాలు 6.12 శాతం, పిండి 6.67 శాతం, పప్పుధాన్యాలు 4.68 శాతం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. రబీ పంటలకూ తేమ కొరత ఎదురైతే ఆహార ద్రవ్యోల్బణం 7 శాతాన్ని దాటవచ్చన్న అంచనాలు వినియోగదారులను కలవరపెడుతున్నాయి. చక్కెర ఉత్పత్తి అంచనాలను 3.36 కోట్ల టన్నుల నుంచి 2.95 కోట్ల టన్నులకు తగ్గించడం మరో హెచ్చరిక. గ్రామీణ భారతాన్ని వేధించబోతున్నది నీటి కొరత ఒక్కటే కాదు.. పశుగ్రాసం సమస్య కూడా.

దేశంలోని 178 ప్రధాన జలాశయాల్లో వర్షాకాలం ముగిసే సమయానికి నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే సుమారు 21% తక్కువగా ఉన్నాయి. తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాశయాల మొత్తం 585 టిఎంసిల నిల్వ సామర్థ్యానికి గాను 241 టిఎంసిల నీరే అందుబాటులో ఉన్నట్టు అంచనాలు చెబుతున్నాయి. భూగర్భ జలాల పునరుద్ధరణ దెబ్బతినడంతో అనేక ప్రాంతాల్లో బావులు, బోర్లు అడుగంటుతున్నాయి. ఊళ్లలో తాగునీటికి జనం అల్లాడుతుంటే, మరోవైపు బాటిల్ వాటర్ తయారీ కేంద్రాలు, బహుళజాతి శీతల పానీయాల సంస్థల కార్యకలాపాలు కొనసాగడం వనరుల పంపిణీలోని అసమానతలను ఎత్తిచూపుతోంది. నీటి కొరత ఏర్పడినప్పుడు ప్రాధాన్యం ప్రజల తాగునీటి అవసరాలకా, వాణిజ్య ప్రయోజనాలకా అన్నది ప్రభుత్వాలు తేల్చాలి పాడి రంగంలోనూ ఇదే అంతరం కనిపిస్తోంది. పెద్ద డెయిరీ సంస్థలకు పశు దాణా కొనుగోలు, నిల్వ, రవాణా సదుపాయాలు మెరుగ్గా ఉంటాయి. కానీ స్థానికంగా లభించే పచ్చిమేత, పంటల అవశేషాలపై ఆధారపడే చిన్న రైతులకు ప్రత్యామ్నాయాలు పరిమితం. పాల ఉత్పత్తి వ్యయంలో 60 నుంచి 70 శాతం వరకు పశుదాణాకే ఖర్చవుతుండటంతో మేత ధరలు పెరిగితే చిన్న పాడి రైతుల ఆదాయం కుంచించుకుపోతుంది. పశువులకు మేత దొరక్క పాల దిగుబడి తగ్గితే రైతుకు నష్టం, వినియోగదారుడికి ధరల భారం రెండూ తప్పవు. సంక్షోభాన్ని తట్టుకునే వనరులు పెద్ద సంస్థలకు ఉండగా, చిన్న ఉత్పత్తిదారులే ఎక్కువగా నష్టపోతున్నారు. నెల జీతంపై ఆధారపడే మధ్యతరగతి పరిస్థితి భిన్నంగా లేదు. ఆదాయం స్థిరంగా ఉన్నా బియ్యం, పప్పులు, పాలు, వంట ఇంధనం, విద్యుత్తు, తాగునీటి ఖర్చులు పెరుగుతూనే ఉంటాయి. గ్రామీణ వినియోగదారుల ధరల సూచీలో ఆహార పదార్థాల వాటా సుమారు 42 శాతం కాగా, పట్టణాల్లో అది 30 శాతం. అందువల్ల ఆహార ధరల పెరుగుదల గ్రామీణ పేదలపై మరింత భారంగా పరిణమిస్తుంది. వర్షాభావ సంవత్సరాల్లో గ్రామీణ వేతనాల వాస్తవ వృద్ధి మందగిస్తే, పంట దిగుబడులు తగ్గి కూలి పనులూ కరువవుతాయి. ఆదాయం తగ్గి ఖర్చులు పెరిగే ఈ ద్వంద్వ దెబ్బ కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెడుతుంది. జలవిద్యుత్తు ఉత్పత్తి తగ్గడం, ఎండలతో శీతలీకరణ పరికరాల వినియోగం పెరగడం విద్యుత్తు వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతాయి. ఆ భారం కూడా చివరికి వినియోగదారులపైనే పడే ప్రమాదముంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా ముందస్తు చర్యలకు ప్రాధాన్యమివ్వాలి. ఆహార నిల్వలను సమర్థంగా వినియోగిస్తూ కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై నిఘా పెంచాలి. తాగునీటికి ప్రథమ ప్రాధాన్యమిస్తూ వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణను వేగవంతం చేయాలి. కరవు ప్రాంతాల్లో పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేసి రైతులకు సబ్సిడీపై దాణా అందించాలి. తక్కువ నీటితో పండే పంటలు, సూక్ష్మ సేద్యంపై ప్రోత్సాహం కల్పించాలి. ఉపాధి హామీ పనులను నీటి సంరక్షణతో అనుసంధానించి గ్రామీణ పేదలకు ఆదాయ భరోసా కల్పించాలి. సూపర్ ఎల్‌నినో కేవలం వాతావరణ వైపరీత్యం కాదు.. ఇప్పటికే ఉన్న ఆర్థిక అసమానతలను మరింత పెంచే సంక్షోభం. పెద్ద సంస్థలకు ప్రత్యామ్నాయ వనరులు ఉంటాయి. కానీ చిన్న రైతు, రోజువారీ కూలీ, నెల జీతంపై ఆధారపడే కుటుంబానికి ఆ వెసులుబాటు ఉండదు. అందుకే వాతావరణ మార్పులను ఎదుర్కొనే వ్యూహంలో ప్రకృతి వనరుల సంరక్షణతోపాటు సామాజిక న్యాయానికీ చోటుండాలి. సంక్షోభం వచ్చాక సాయం చేయడం కంటే, దాని భారాన్ని ఎక్కువగా మోసే వర్గాలను ముందుగానే గుర్తించి ఆదుకోవడం ముఖ్యం. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే సంసిద్ధత ఎంత ముఖ్యమో, వాటి భారాన్ని బలహీన వర్గాలపై పడకుండా చూడటమూ అంతే ముఖ్యం.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

కేజీబీవీలో విద్య, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి...

-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బచ్చన్నపేట,వార్త సంధ్య : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పాఠశాలల్లో పారిశుద్ధ్యాన్ని పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. మంగళవారం బచ్చన్నపేట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, భోజన నాణ్యత, వంటగది, సరుకుల నిల్వ, మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. పదో తరగతి విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమం తప్పకుండా చదవాలని సూచించారు. గణితం, ఆన్‌లైన్ పాఠాలు, గెట్ ఇట్ రైట్ పుస్తకంలోని అధ్యాయాల పురోగతిపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చదువుతో పాటు ప్రతి విద్యార్థికి క్రీడల్లో రాణించాలి...

-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ వార్త సంధ్య
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో పీఎం శ్రీ పాఠశాలలు, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల 2026--27 క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఏకాగ్రత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడల్లో విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని, ప్రతిభ కనబరిస్తే పారా ఒలింపిక్స్, ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషితో జనగామ జిల్లా విద్యారంగంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని, గత ఏడాదితో పోలిస్తే ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 3,000 మంది విద్యార్థులు అదనంగా చేరడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, ఎస్జీఎఫ్ కార్యదర్శి గోర్ సింగ్, సీఎంఓ యాదగిరి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో విషాదం.. దంపతులు, చిన్నారి మృతి

గోడలపై సూసైడ్ నోట్.. ఆర్థిక ఇబ్బందులే కారణమా?

వార్త సంధ్య కూకట్‌పల్లి
కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ దంపతులు, వారి రెండేళ్ల చిన్నారి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లోని రాధామన్‌పూర్‌కు చెందిన భూయన్ గోపీనాథ్ (30), ఆయన భార్య సంగీత (26), రెండేళ్ల కుమార్తె సృష్టితో కలిసి కేపీహెచ్‌బీ కాలనీలోని ఎంజీ-49లో ఉన్న ఫ్లాట్ నంబర్ 4లో నివాసం ఉంటున్నారు. గోపీనాథ్ గచ్చిబౌలిలోని మాస్టర్ పీస్ రెస్టారెంట్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి గోపీనాథ్ విధులకు హాజరు కాకపోవడంతో ఆయనతో పనిచేసే అమిత్ ఫోన్ చేశాడు. అయితే, గోపీనాథ్ ఫోన్‌కు స్పందించకపోవడంతో అమిత్ ఆయన సోదరులకు సమాచారం అందించాడు. దీంతో వారు గోపీనాథ్ నివాసానికి చేరుకున్నారు. ఎంతసేపటికీ తలుపులు తెరవకపోవడంతో వాటిని బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా, బెడ్‌రూంలో చిన్నారి సృష్టి మంచంపై విగతజీవిగా కనిపించింది. గోపీనాథ్, సంగీత మృతదేహాలు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాయి. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ రవి కిరణ్ రెడ్డి, సీఐ విజయ్ కుమార్, ఎస్ఐ భాను ప్రసాద్ వివరాలు సేకరించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను పరిశీలించారు. ఇదిలా ఉండగా, తమ మరణాలకు ఎవరూ కారణం కాదని, తమను క్షమించాలని గోపీనాథ్, సంగీత గోడలపై రాసినట్లు సమాచారం. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

ఉద్యమకారులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలి

-తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఫౌండర్ చైర్మన్ డా.చీమ శ్రీనివాస్ డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 27 వార్త సంధ్య
రాబోయే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఫౌండర్ చైర్మన్ డా.చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'మన ఓటు – మన గొంతుక' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి తెలంగాణ ఉద్యమకారుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. డిగ్రీ అర్హత కలిగిన విద్యావంతులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు సైతం ఓటరు నమోదుపై దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుల గొంతుక శాసన మండలిలో వినిపించాలంటే ఉద్యమకారులంతా ఐక్యంగా ఉండి, ఉద్యమకారుడినే గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు ఉద్యమకారులను విస్మరిస్తూ కార్పొరేట్ వర్గాలు, ధనవంతులు, ఉద్యమంతో సంబంధం లేని వారికి ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉద్యమకారులకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఓటును అమ్ముకోవద్దని, ధనస్వామ్యంగా మారుతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత విద్యావంతులపై ఉందని అన్నారు. విద్యావంతులు సైతం ఓటును విక్రయించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సామాజిక, ప్రజాస్వామిక తెలంగాణ సాధన కోసం ప్రతి తెలంగాణ ఉద్యమకారుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దయానంద్, జగన్ యాదవ్, జోగు అంజయ్య, భూపాల్, శ్యామల, మంజూష, కొండా స్వామి, శివకుమార్ నేత, చంద్రశేఖర్, భాను ప్రకాశ్, సెబాస్టియన్, ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా: బండి రమేష్

విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనకు బసంతి ఫౌండేషన్ సహకారం

వార్త సంధ్య కూకట్‌పల్లి:
కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ చొరవ తీసుకున్నారు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య కళాశాలలో సీలింగ్ ఫ్యాన్లు, ఫర్నిచర్ కొరతతో పాటు పాత భవనం కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు బసంతి ఫౌండేషన్ చైర్మన్ అజయ్ మాట్లాడి, కళాశాలకు సీలింగ్ ఫ్యాన్లు, ఫర్నిచర్‌తో పాటు విద్యార్థుల కోసం 1,500 గ్లాస్ వాటర్ బాటిళ్లు అందించేలా చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, తన విజ్ఞప్తికి వెంటనే స్పందించి విద్యార్థుల అవసరాలకు సహకారం అందించిన బసంతి ఫౌండేషన్ చైర్మన్ అజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా మరింత మంది విద్యార్థులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పాతదై శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కళాశాలలో ప్రవేశాల కోసం వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నప్పటికీ, ప్రస్తుతం సుమారు 1,500 మంది విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్లు కల్పించే పరిస్థితి ఉందని ప్రిన్సిపాల్ వెంకటయ్య తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం, విద్యాసంస్థలను బలోపేతం చేయడం, మరింత మంది విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించడం లక్ష్యంగా కళాశాల స్థల సమస్యను ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని బండి రమేష్ తెలిపారు. నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు, ప్రభుత్వ సహకారంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారం తీసుకునే అవకాశాలపై కూడా కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే పునాది అని పేర్కొన్న బండి రమేష్ , ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము వేణు, చున్ను పాషా, సప్పిడి భాస్కర్, తూము సంతోష్, శంకర్, రఘు, పుష్పారెడ్డి, జ్యోతి, సోను, రమణ, నళినీకాంత్, వాసు, హుస్సేన్, బాలరాజు, అక్బర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పింకథాన్ డేలో 10 వేల మందికి పైగా మహిళలు

హైదరాబాద్, అక్టోబర్ 27 వార్త సంధ్య
మహిళల ఫిట్‌నెస్, ఆరోగ్యం, ఆర్థిక అవగాహనను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన పింకథాన్ డే 4వ ఎడిషన్‌లో 10 వేల మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. మ్యూచువల్ ఫండ్స్ సహీ హై టైటిల్ పార్ట్‌నర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమం భారత్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌లోని 65 నగరాలు, 168 ప్రాంతాల్లో జరిగింది. హైదరాబాద్‌లో 3 కిలోమీటర్ల పరుగును నిర్వహించారు. 96 ఏళ్ల వృద్ధురాలు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(ఏఎంఎఫ్ఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ ఎన్.చలసాని, పింకథాన్ వ్యవస్థాపకుడు మిలింద్ సోమన్ మహిళలు శారీరక ఆరోగ్యంతో పాటు ఆర్థిక భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు.

దక్షిణాదిలో సగానికి తగ్గిన వేడి, పొడి వాతావరణ ప్రాంతం : ఐఎండీ

హైదరాబాద్, అక్టోబర్ 27 వార్త సంధ్య దక్షిణ భారతదేశంలో వేడి, పొడి వాతావరణ ప్రాంతం 1951 - 1980 మధ్య 30 శాతం ఉండగా, 1991 - 2020 నాటికి 16 శాతానికి తగ్గిందని ఐఎండీ, పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ శాస్త్రవేత్తల అధ్యయనం వెల్లడించింది. వర్షపాతం పెరగడంతో ఉష్ణమండల సవన్నా ప్రాంతం విస్తరించిందని, ఈ అధ్యయనం 'మౌసం' జర్నల్‌లో ప్రచురితమైందని తెలిపింది. అయితే, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో దక్షిణాదిలో సాధారణం కంటే 24.3 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. అధ్యయన ప్రధాన రచయిత అనన్య కర్మాకర్ మాట్లాడుతూ, దీర్ఘకాలంలో వర్షపాతం పెరిగినా ఎల్‌నినో సంవత్సరాల్లో కరవు ముప్పు తప్పదన్నారు. ఐఎండీ డైరెక్టర్ జనరల్, అధ్యయన సహ రచయిత మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ, దీర్ఘకాల వాతావరణ మార్పులతో పాటు కాలానుగుణ హెచ్చుతగ్గులను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

దత్తతకు సుముఖంగా 25 శాతం పెంపుడు జంతువుల యజమానులు : మార్స్ సర్వే

హైదరాబాద్, అక్టోబర్ 27 వార్త సంధ్య
సరైన మార్గదర్శకత్వం, మద్దతు లభిస్తే భారతదేశంలో దత్తత తీసుకోని పెంపుడు జంతువుల యజమానుల్లో 25 శాతం మంది భవిష్యత్తులో జంతువులను దత్తత తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని మార్స్ సంస్థ నిర్వహించిన సర్వే వెల్లడించింది. బాధ్యతాయుతమైన పెంపుడు జంతువుల సంరక్షణ, దత్తతను ప్రోత్సహించే లక్ష్యంతో మార్స్ గ్లోబల్ అడాప్షన్ వీకెండ్-2026ను 30కి పైగా దేశాల్లో నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మార్స్ ఫ్యాక్టరీలో ఆస్రా యానిమల్ రెస్క్యూ అండ్ వెల్ఫేర్ సంస్థ సహకారంతో దత్తత కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్లూ క్రాస్ హైదరాబాద్ భాగస్వామ్యంతో చేపట్టిన దత్తత డ్రైవ్‌లో నిరాశ్రయ జంతువులకు కొత్త ఇళ్లు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఫ్యాక్టరీలో తొలిసారిగా ఓ కుక్కపిల్లను మార్స్ ఉద్యోగి దత్తత తీసుకోవడం విశేషం. పెయింట్ విత్ పప్పీస్, పెట్ ట్రివియా, పెట్ యోగా వంటి కార్యక్రమాలతో పాటు దత్తతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. భారత దేశ వ్యాప్తంగా 2,000 మందిపై నిర్వహించిన

సెన్సస్‌వైడ్ సర్వే ప్రకారం, జంతువుల వైద్య చరిత్ర తెలియకపోవడం(34 శాతం), ఇంటి వాతావరణానికి అవి అలవాటు పడతాయో లేదోననే సందేహాలు(27 శాతం), ప్రవర్తనా నేపథ్యంపై స్పష్టత లేకపోవడం(23 శాతం) దత్తతకు ప్రధాన అడ్డంకులుగా ఉన్నాయి. దేశంలో సుమారు 6.93 కోట్ల పెంపుడు జంతువులు ఆశ్రయం లేకుండా ఉన్నట్లు 2023 నాటి మార్స్ సర్వే అంచనా వేసింది. మార్స్ పెట్ న్యూట్రిషన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ స్యాగ్ మాట్లాడుతూ, జంతువులకు ప్రేమతో కూడిన ఇళ్లను కల్పించడంతో పాటు బాధ్యతాయుతమైన సంరక్షణ, టీకాలు, జంతు జనన నియంత్రణ, సామాజిక అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. భారతదేశంలో 56 శాతం మంది ఆశ్రయ కేంద్రాలు లేదా రెస్క్యూ సంస్థల ద్వారా జంతువులను దత్తత తీసుకున్నారని, ప్రపంచవ్యాప్తంగా ఈ శాతం 42గా ఉందని తమ పరిశోధన వెల్లడించినట్లు పేర్కొన్నారు. దత్తత ప్రక్రియకు ముందు, తర్వాత అవసరమైన నిపుణుల సలహాలు, ఆచరణాత్మక మార్గదర్శకత్వం అందించేందుకు మార్స్ కొత్తగా ఆన్‌లైన్ అడాప్షన్ హబ్‌ను ప్రారంభించింది. వాల్థమ్ పెట్ కేర్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ వేదిక ద్వారా పెంపుడు జంతువుల సంరక్షణ, పోషకాహారం, బాధ్యతాయుతమైన దత్తతపై సమాచారాన్ని అందిస్తున్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

బ్రిటన్‌లో కారు రేస్.. ఇద్దరు భారత సంతతి వ్యక్తులకు 28 ఏళ్ల జైలుశిక్ష



లండన్ అక్టోబర్ 27 వార్త సంధ్య

బ్రిటన్‌లో కారు రేస్ లో పాల్గొని తల్లీకూతుళ్ల మృతికి కారణమైన ఇద్దరు భారతీయ సంతతి వ్యక్తులకు జైలుశిక్ష పడింది. ఆ ఇద్దరికీ కలిపి 28 ఏళ్ల జైలుశిక్ష విధించారు. 2023 జనవరిలో రోడ్డు ప్రమాద ఘటన జరిగింది. ఈ కేసులో జాస్‌కమల్ రియాత్, హర్దీప్ బాచూకు జైలుశిక్ష పడింది. రియాత్ వయసు 37 ఏళ్లు, హర్దీప్ 29 ఉన్నాడు. బాచూకు చెందిన ఆడీ టీటీ ఆర్ఎస్ కారు ఢీకొనడంతో స్కూల్‌కు వెళ్తున్న తల్లీకూతుళ్లు మృతిచెందారు. బాచూతో కలిసి రియాత్ కారు రేసులో పాల్గొన్నట్లు సీసీటీవీ ఫూటేజ్ ద్వారా తెలిసింది. రియాత్ బీఎండబ్ల్యూ ఎం135ఐ కారులో రేస్ చేశాడు.నేరాన్ని అంగీకరించిన బాచూకు 12 ఏళ్ల జైలుశిక్ష పడింది. కానీ తన తప్పు లేదని వాదించిన రియాత్‌కు 16 ఏళ్ల జైలుశిక్ష విధించారు. ఇద్దరికీ ఆరేళ్ల పాటు డ్రైవింగ్ నిషేధించారు. రోడ్డు అనేది రేస్ ట్రాక్ కాదు అని, ప్రజా రవాణా రోడ్డుపై శక్తివంతమైన కార్లను పరీక్షించడం సరికాదు అని జడ్జీ రే సింగ్ తన తీర్పు సమయంలో పేర్కొన్నారు. పోటీపడి అతివేగంగా వాహనాన్ని నడపడం వల్ల ప్రాణ నష్టం జరిగినట్లు జడ్జీ తెలిపారు. అయితే రేస్ జరగడానికి ముందు ఇద్దరికీ పరిచయం లేదని, ఓ ట్రాఫిక్ లైట్ దగ్గర ఆగిన సమయంలో కార్లు పక్కపక్కనే ఆగడం వల్ల ఇద్దరు పరిచయం చేసుకున్నారని, ఇక వాళ్ల కార్ల సత్తాను పరీక్షించుకునేందుకు రోడ్డు రేస్ చేశారని విచారణలో తేల్చారు. బాచూ డాష్‌కామ్ ఫూటేజ్, రియాత్ ఫోన్ ఆధారంగా కూడా ఈ కన్ఫర్మేషన్ చేశారు.

ప్రాపర్టీపై వివాదం.. హోటల్‌లో అయిదుగురి కాల్చివేత

గౌహతి:అక్టోబర్ 27 వార్త సంధ్య

అస్సాంలోని గౌహతి లో దారుణం జరిగింది. ఓ హోటల్‌లో అయిదురు కాల్చివేతకు గురయ్యారు. ప్రాపర్టీ ఓనర్, లీజ్‌హోల్డర్ మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. హోటల్ బిలాస్ ఇన్‌లో రాత్రి 9 గంటలకు కాల్పులు జరిగాయి. అస్సాం పోలీసు ప్రధాన కార్యాలయానికి 2 కిలోమీటర్ల దూరంలో జరిగింది. ఆరుగురికి బుల్లెట్ గాయాలు కాగా, దాంట్లో అయిదుగురు మృతిచెందినట్లు పోలీసు కమీషనర్ పార్ధసారథ మహంత తెలిపారు. నిందితుడిని గణకంట గగోయ్‌గా గుర్తించారు. ప్రాపర్టీ లీజ్‌హోల్డర్ అతను. ఘటన జరిగిన గంటలోనే అతన్ని పల్టన్ బజార్ ఏరియాలో అదుపులోకి తీసుకున్నారు. .32 బోర్ లైసెన్స్ పిస్తోల్‌ను వాడారు. దాన్ని సీజ్ చేశారు. కేసులో దర్యాప్తు జరుగుతున్నది. హోటల్ లీజు అగ్రిమెంట్ అంశంలో గొడవ జరిగిందని, ప్రాపర్టీ వివాదం నేపథ్యంలో ఫైరింగ్ జరిగినట్లు మహంత్ తెలిపారు. మృతిచెందిన అయిదుగురు వ్యక్తులు హోటల్ ఓనర్‌కు సంబంధితులే. దాంట్లో నలుగురు ఒకే కుటుంబసభ్యులు. ఏడాది క్రితం గగోయ్ హోటల్‌ను లీజుకు తీసుకున్నాడు.

వివాహితపై సామూహిక లైంగిక దాడి

ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

సైదాబాద్, అక్టోబర్ 27 వార్త సంధ్య

వివాహితపై ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ బాలరాజు వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన ఫయాజ్‌కు మయన్మార్‌కు చెందిన మహిళతో కొంత కాలం క్రితం వివాహమైంది. ఫయాజ్ దంపతులు కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోషన్ దౌలా ప్రాంతంలోని డైమండ్ హోటల్ సమీపంలో నివాసముంటున్నారు. ఫయాజ్ స్నేహితులు మయన్మార్‌కు చెందిన కమల్, ముజీబ్ , రెహ్మాన్ అలియాస్ ఇబ్రహీం అదే ప్రాంతంలో నివాసముంటున్నారు. కాగా ఇంటి వద్ద ఫయాజ్ భార్య ఒంటరిగా ఉన్న సమయంలో ముగ్గురు వ్యక్తులు చొరబడి సామూహిక లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు తమ సమీప బంధువుతో చెప్పింది.బాధితురాలితో కలిసి వారు కాంచన్‌బాగ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బాధితురాలిని భరోసా సెంటర్‌కు తరలించి విచారించి వివరాలను సేకరించారు. బాధితురాలిపై లైంగిక దాడి జరిగినప్పటి నుంచి భర్త ఫయాజ్ పరారీలో ఉండటంతో పోలీసులకు అనుమానం రావడంతో అతడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపారు.

బ్రేకింగ్ బ్యాడ్, ప్రిజన్ బ్రేక్..

విజయ్ సర్కారుపై మాజీ సీఎం స్టాలిన్ సెటైర్లు..!

న్యూఢిల్లీ:అక్టోబర్ 27 వార్త సంధ్య

: తమిళనాడు లో జోసెఫ్ విజయ్ ప్రభుత్వానికి వరుసగా చిక్కులు ఎదురవుతున్నాయి. ఇటీవలే ఆ పార్టీకి చెందిన కార్యకర్త ఒకరు డ్రగ్స్ అక్రమ రవాణాచేస్తూ పట్టుపడి అధికార పార్టీని ఇరకాటంలో పెట్టాడు. ఇప్పుడు తేనిలోని జైలు నుంచి ఖైదీలు పారిపోవడంతో ప్రభుత్వంపై విమర్శలపాలవుతోంది. వీటిపై మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శనాస్త్రాలు సంధించారు. మొన్న 'బ్రేకింగ్ బ్యాడ్', ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్ ' అంటూ సోషల్ మీడియా లో పోస్టుపెట్టారు.ప్రముఖ వెబ్ సిరీస్‌ల పేర్లతో రాష్ట్రంలోని శాంతి భద్రతలను పోల్చారు. తమిళనాడులో 'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత 'ప్రిజన్ బ్రేక్' మొదలైందని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం బెయిల్‌పై బయట ఉన్న నేరస్థులనే పర్యవేక్షించడం లేదనుకున్నానని, జైలులో ఉన్న ఖైదీలు తప్పించుకుంటున్నా చూస్తూ కూర్చుంటోందని ఇప్పుడు స్పష్టమైందని విమర్శించారు. ఇప్పటికే పుళల్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు తప్పించుకున్న ఘటన మరవకముందే ఇప్పుడు తేని జైలు నుంచి 17 మంది పారిపోయారన్నారు. 1995 తర్వాత ఒకేసారి ఇంతమంది ఖైదీలు పారిపోవడం ఇదే తొలిసారని స్టాలిన్ పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్లు, మెరుగైన సాంకేతికత ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. బయట ఉన్న నేరగాళ్లు స్వేచ్ఛగా నేరాలు చేస్తున్నారని, లోపల ఉన్న ఖైదీలు ధైర్యంగా తప్పించుకుంటున్నారని విమర్శలు చేశారు. మొత్తం మీద ఎవరికీ ఉపయోగపడని ప్రభుత్వం మనదని, వారు ప్రజలను రక్షించరని ఎద్దేవా చేశారు. ప్రజలే తమను తాము కాపాడుకోవాల్సిన పరిస్థితికి తమిళనాడు చేరిందని తీవ్ర విమర్శలు చేశారు. రూ.100 కోట్ల విలువైన 135 కిలోల డ్రగ్స్ అక్రమ రవాణా చేసిన కేసులో ఇటీవల నాగపట్టణానికి చెందిన టీవీకే నేత ఒకరు అరెస్టయ్యారు. దానిపై స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. బ్రేకింగ్ బ్యాడ్ అనే వెబ్‌సిరీస్‌ను ప్రస్తావిస్తూ.. టీవీకే 'బ్యాడ్ పార్టీ' మాత్రమే కాదని, 'బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ' అని వ్యాఖ్యలు చేశారు. తాజాగా తన పోస్టులో దీనితోపాటు మరో వెబ్ సిరీస్ 'ప్రిజన్ బ్రేక్' పదాన్ని ప్రస్తావించారు.

రాజీవ్ ప్రధాని కావడం నాకుష్టం లేదు

- అనుభవాలను నిజాయితీగా వివరించాను..
- ఫలితంగా, కొందరి అభిప్రాయాలు మారొచ్చు
- ఆత్మకథపై చర్చలో వెల్లడించిన సోనియా గాంధీ
- తన ఆత్మకథలో కుటుంబ జీవితం, రాజకీయ ప్రస్థానం

న్యూఢిల్లీ:అక్టోబర్ 27 వార్త సంధ్య

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన జీవిత విశేషాలతో రూపొందించిన ఆత్మకథ 'బిలాంగింగ్ : ఎ జర్నీ ఆఫ్ లవ్' ద్వారా తన వ్యక్తిగత జీవితం, కుటుంబ అనుభవాలు, రాజకీయ ప్రస్థానానికి సంబంధించిన అనేక అంశాలను వెల్లడించనున్నారు. తన భర్త రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావాలని నిర్ణయించినప్పుడు తాను తీవ్రంగా వ్యతిరేకించానని ఆమె తెలిపారు. ఈ పుస్తకంలో తన అనుభవాలను నిజాయితీగా వివరించానని, అందువల్ల కొందరి అభిప్రాయాలు మారొచ్చని పేర్కొన్నారు. మంగళవారం తన సోషల్ మీడియా ఖాతాలలో విడుదల చేసిన వీడియోలో సోనియా గాంధీ ఈ విషయాలను వెల్లడించారు. తన జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలను తన దృక్పథం లో పాఠకులకు తెలియజేసేందుకు ఈ పుస్తకం అవకాశం కల్పించిందని ఆమె వివరించారు. పుస్తకం వెలువడిన తర్వాత ప్రజల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యే అవకాశం ఉందని, బహిరంగ జీవితంలో ఇలాంటివి సహజమని పేర్కొన్నారు.

సోనియా గాంధీ జీవితంలోని వ్యక్తిగత, రాజకీయ అంశాలను ఈ ఆత్మకథ స్పృశించనుంది. ముఖ్యంగా గాంధీ కుటుంబంలో చోటు చేసుకున్న కీలక పరిణామాలు, రాజకీయాల్లోకి రాజీవ్ గాంధీ ప్రవేశం, కుటుంబాన్ని కుదిపేసిన విషాద సంఘటనలు, భారత రాజకీయాల్లో సోనియా గాంధీ పాత్ర వంటి అంశాలు ఇందులో ప్రస్తావనకు రానున్నాయి. ఈ పుస్తకం నవంబర్ 10న విడుదల కానుంది.

ఇటలీలో బాల్యం నుంచి భారత రాజకీయాల వరకు..

సోనియా గాంధీ ఆత్మకథ ఇటలీలోని వెనెటో ప్రాంతంలో ఆమె గడిపిన బాల్యం నుంచి ప్రారంభమవుతుంది. అనంతరం రం ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో చదువుకుంటున్న సమయంలో 1965లో రాజీవ్ గాంధీతో పరిచయం, వారి వివాహం, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పరిచయం, భారతీయ జీవనశైలి అలవాటు పడిన తీరు వంటి అంశాలను ఈ పుస్తకం వివరించింది. వ్యక్తిగత జీవితంలోని విషాదాలకే పరిమితం కాకుండా, కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణంలో సోనియా గాంధీ పాత్ర, పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన తీరు, 2004 ఎన్నికల తర్వాత యూపీఏ ప్రభుత్వ ఏర్పాటులో ఆమె పోషించిన పాత్ర వంటి రాజకీయ అంశాలనూ ఈ పుస్తకం చర్చించనుంది.

ప్రధాని పదవిని తిరస్కరించిన ఘటన

2004 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) విజయం సాధించిన తర్వాత సోనియా గాంధీ ప్రధానమంత్రి పదవిని స్వీకరించకపోవడం ఆమె రాజకీయ జీవితంలో కీలక ఘట్టంగా నిలిచింది. ఆమె స్థానంలో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్న నిర్ణయాన్ని తాను వ్యతిరేకించినట్లు సోనియా గాంధీ వెల్లడించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాజకీయ అధికారానికి సంబంధించి గాంధీ కుటుంబం ఎదుర్కొన్న నిర్ణయాలు, వ్యక్తిగత సంఘర్షణలపై ఆమె దృక్పథాన్ని ఈ ఆత్మకథ మరింత స్పష్టం చేసే అవకాశం ఉంది.

హైసెక్యూరిటీ జైలు బ్లాక్‌లోకి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్..!

న్యూఢిల్లీ:అక్టోబర్ 27 వార్త సంధ్య

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ పై కాల్పుల ఘటన నేపథ్యంలో ఆ దాడి వెనుక గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ఉన్నారనే వార్తలు జోరందుకున్నాయి. కొన్నేళ్లుగా అతడు జైల్లోనే ఉన్నప్పటికీ బయట అతడి అనుచరులు సాగిస్తున్న నేర కార్యకలాపాలు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో అతడిపై దాడి జరగవచ్చుననే అనుమానంతో అధికారులు అతడిని మరింత కట్టుదిట్టమైన భద్రత ఉండే జైలుగది కి మార్చినట్లు తెలుస్తున్నది.ప్రస్తుతం లారెన్స్ బిష్ణోయ్ గుజరాత్‌లోని సబర్మతి సెంట్రల్ జైలులో ఉన్నాడు. మొన్నటివరకు '10-సెల్' బ్లాక్‌లో ఉన్న అతడిని ఇప్పుడు హైసెక్యూరిటీ ఉండే '200 బ్లాక్' కు మార్చినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ బ్లాక్‌ను మొత్తం నాలుగు భాగాలుగా విభజించారు. ఒక్కో సెక్షన్‌లో 50 మంది ఖైదీల చొప్పున మొత్తం 200 మంది ఉంటారు. ఒక్కో సెల్ 7.5ఐ11 అడుగుల పరిమాణంలో ఉంటుంది. ఖైదీల మధ్య ఎలాంటి సంభాషణ జరగకుండా ఇక్కడ నిరంతర నిఘా పెట్టారు. 2008 బాంబు పేలుళ్ల దోషులు కూడా ఇదే బ్లాక్‌లో శిక్ష అనుభవిస్తున్నారు. ఇప్పుడు లారెన్స్ బిష్ణోయ్‌ను కూడా 200 బ్లాక్‌లోని గదికి మార్చారు. పంజాబ్‌కు చెందిన లారెన్స్ బిష్ణోయ్ 2010-12 నుంచి నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. హత్యలు, దోపిడీ వంటి నేరాల్లో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. 2014లో అక్రమాయుధాల కేసులో అరెస్టయ్యాడు. పంజాబ్‌లోని కొన్ని జైళ్లతోపాటు ఢిల్లీలోని తిహార్ జైలులో అతడిని కొంతకాలం నిర్బంధించారు. అయితే జైల్లో నుంచే అతడు నేర కార్యకలాపాలను సాగించాడు. జైలు ఫోన్ నుంచే దోపిడీ కోసం బెదిరింపు ఫోన్ కాల్స్ చేయడం, తన నెట్‌వర్క్‌కు ఆడియో, వీడియో సందేశాలు పంపడం లాంటివి చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఓసారి కస్టడీలో ఉండగానే అతడు మీడియాకు ఇంటర్వ్యూ ఇవ్వడం కూడా వివాదాస్పదమైంది. ఆ తర్వాత మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో లారెన్స్ బిష్ణోయ్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ 2023లో అదుపులోకి తీసుకుని సబర్మతి సెంట్రల్ జైలుకు తరలించింది. అప్పటి నుంచి ఇదే జైల్లో ఉన్నాడు. అయితే గత రెండేళ్లుగా అతడు బయటి వ్యక్తులకు ఫోన్ చేయడం గానీ, నేరుగా సంభాషించిన సందర్భాలు లేవని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. కేవలం న్యాయ బృందంతో మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు. కోర్టు విచారణలకూ వర్చువల్‌గానే హాజరైనట్లు వెల్లడించారు. అయినప్పటికీ లారెన్స్ బిష్ణోయ్ పేరుతో నేర కార్యకలాపాలు కొనసాగుతుండటం గమనార్హం. లారెన్స్ స్నేహితుడైన మరో గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్, రోహిత్ గొదారా వంటి వారు విదేశాల్లో ఉంటూ ఈ నేరాలకు కుట్రలు చేస్తున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వారి ఆటకట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పది లక్షల మందితో నిరసనకు దిగితే వ్యాపారాలు ఎలా సాగించాలి?

- రాహుల్‌గాంధీకి ఢిల్లీ వ్యాపార సంఘాల మరో లేఖ

న్యూఢిల్లీ, నేషనల్ బ్యూరో: అక్టోబర్ 27 వార్త సంధ్య

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలనే డిమాండ్‌తో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన భారీ నిరసన ర్యాలీపై ఢిల్లీ వ్యాపార సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీపావళి పండుగ వ్యాపారాలు జోరుగా సాగే సమయంలో పది లక్షల మందితో నిరసన చేపడితే తాము వ్యాపారాలు ఎలా నిర్వహించుకోవాలని ప్రశ్నిస్తున్నాయి. ర్యాలీని వాయిదా వేయాలని ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాసిన ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ), స్పందన లేకపోవడంతో మరోసారి లేఖ రాసింది. నవంబర్ 1న రామ్‌లీలా మైదానం పరిసరాల్లో భారీ ర్యాలీ నిర్వహిస్తే సుమారు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేసింది. ర్యాలీని నవంబర్ 10కి వాయిదా వేయాలని, అది సాధ్యం కాకపోతే ప్రధాన వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కూడా లేఖ ప్రతులను పంపినట్లు తెలిపారు. ఈ అంశంపై ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో రామ్‌లీలా మైదానం పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడం, రహదారులను మూసివేయడం వంటి చర్యలతో వినియోగదారులు మార్కెట్లకు చేరుకోవడం కష్టమవుతుందని పేర్కొన్నారు. ఢిల్లీలోని ఇరుకైన వీధుల్లోకి లక్షలాది మంది నిరసనకారులతోపాటు దాదాపు 20 వేల వాహనాలు ప్రవేశిస్తే రాకపోకలు స్తంభించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబర్ 10న జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో సుమారు నాలుగు వేల మంది పాల్గొనడంతోనే ఢిల్లీలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని గుర్తుచేశారు. ఆ నిరసనల కారణంగా వ్యాపారులకు దాదాపు రూ.3 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. పండుగ సీజన్‌లో వ్యాపారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ నాయకత్వం ర్యాలీ తేదీ లేదా వేదికను మార్చాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

అయ్యప్పపై 'మాలికాపూరం' దర్శకుడి కొత్త చిత్రం..

'మణికంఠ' ఫస్ట్ లుక్ విడుదల

మలయాళంలో సంచలన విజయం సాధించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'మాలికాపూరం' దర్శకుడు విష్ణు శశి శంకర్ నుంచి మరో ఆధ్యాత్మిక చిత్రం రాబోతోంది. తంత్రా ఫిలిమ్స్ పతాకంపై తెరకెక్కుతున్న తాజా చిత్రం 'మణికంఠ'. అయ్యప్ప స్వామి నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. '(అయ్యప్ప దర్శనానికి సిద్ధం కండి) అంటూ సాగిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో వైభవ్ టైటిల్ రోల్‌లో నటించబోతుండగా, మీనాక్షి గోవిందరాజన్ , అరవింద్ ఆకాష్, జె.కె. శరవణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్ గి అమరన్ సంగీతం అందిస్తుండగా, సూర్య రాజీవన్, శతశ్ కుమార్ తదితరులు ఇతర సాంకేతిక విభాగాల్లో పని చేస్తున్నారు. అయ్యప్ప భక్తులను, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకునేలా రూపొందుతున్న ఈ 'మణికంఠ' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలువడనున్నాయి.

నాగచైతన్య కెరీర్‌లోనే భారీ డీల్.. రూ.45 కోట్లకు 'వృషకర్మ' హక్కులు?

'తండేల్' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న అక్కినేని నాగచైతన్య ఇప్పుడు 'వృషకర్మ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మిస్టరీ, అతీంద్రియ అంశాలతో కూడిన థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, సినిమా నేపథ్యంపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. తాజాగా ఈ సినిమా పంపిణీ హక్కులకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతోంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు చెందిన ఎస్‌వీసీ రిలీజెస్ సంస్థ 'వృషకర్మ' పంపిణీ హక్కులను సొంతం చేసుకున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ హక్కుల కోసం దిల్ రాజు ఏకంగా రూ.45 కోట్లు చెల్లించినట్లు తాజా సమాచారం వినిపిస్తోంది. ఇందులో రూ.40 కోట్లు తిరిగి చెల్లించని మొత్తంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి ఆర్థిక వివరాలపై అధికారిక క్లారిటీ లేదు. ఒకవేళ ఇదే నిజమైతే, నాగచైతన్య కెరీర్‌లోనే అత్యంత భారీ పంపిణీ ఒప్పందాల్లో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. ఈ వార్తతో సినిమాపై వ్యాపార వర్గాల్లోనూ ఆసక్తి పెరుగుతోంది. థియేట్రికల్ పంపిణీ హక్కులతో పాటు 'వృషకర్మ' డిజిటల్ ప్రసార హక్కులు కూడా నిర్మాతలకు మంచి మొత్తాన్ని తెచ్చిపెట్టినట్లు సమాచారం. అయితే, డిజిటల్ హక్కులను ఏ సంస్థ కొనుగోలు చేసింది? ఎంత ధరకు ఒప్పందం కుదిరింది? అనే వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది. సినిమా విడుదల సమయం దగ్గరపడుతుండటంతో చిత్రబృందం త్వరలో ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేయనున్నట్లు తెలుస్తోంది. 'వృషకర్మ' చిత్రాన్ని ఎస్‌వీసీసీ పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్ ఈ ప్రాజెక్టుతో అనుబంధంగా ఉండగా, బాపినీడు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో నాగచైతన్య సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ ముగింపు దశకు చేరుకున్నట్లు సమాచారం. మరోవైపు నిర్మాణానంతర పనులు కూడా కొనసాగుతున్నాయి. ఈ చిత్రాన్ని 2026 డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. 'తండేల్' తర్వాత నాగచైతన్య నుంచి వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో అంచనాలు పెరిగాయి.

విజయ్ దేవరకొండ 'రణబాలి' నుంచి 'కోబలి' వీడియో సాంగ్ విడుదల.!



రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రానికి సంబంధించి తాజాగా విడుదలైన 'కోబలి' వీడియో సాంగ్ ఇటు యూట్యూబ్‌లో, అటు సోషల్ మీడియాలోనూ సంచలన రికార్డులతో దూసుకుపోతోంది. 19వ శతాబ్దపు చారిత్రక నేపథ్యంలో సాగే ఈ విప్లవాత్మక కథాంశంలో విజయ్ దేవరకొండ సరికొత్త యోధుడి లుక్‌లో కనిపించి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నారు. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ అందించిన ఈ పాటలోని ఫోక్ మరియు ఎమోషనల్ బీట్స్ శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. విడుదలైన తక్కువ సమయంలోనే మిలియన్ల కొద్దీ వ్యూస్‌ను సొంతం చేసుకున్న ఈ 'కోబలి' పూర్తి వీడియో సాంగ్ ప్రస్తుతం యూట్యూబ్‌లోని అధికారిక ఛానెల్‌లో అందుబాటులో ఉంది.

ట్రోలర్స్‌కు కృతి సనన్ స్ట్రాంగ్ కౌంటర్!

బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నేషనల్ అవార్డ్ విన్నర్ కృతి సనన్.. సోషల్ మీడియా ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. హీరోయిన్ల డ్రెస్సింగ్, బాడీ షేమింగ్‌పై జరుగుతున్న ఆన్‌లైన్ హరాస్‌మెంట్ మీద మండిపడ్డారు ఈ బ్యూటీ. మహిళల స్వేచ్ఛ గురించి కృతి చేసిన బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు బీటౌన్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా సోషల్ మీడియా కామెంట్స్ ను లైట్ తీసుకునే కృతి సనన్.. కరీనా కపూర్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' షోలో మాత్రం ట్రోలర్స్‌పై ఫైర్ అయ్యారు. రీసెంట్‌గా ఓ రక్షాబంధన్ జ్యువెలరీ యాడ్‌లో తాను వేసుకున్న డ్రెస్‌పై జరిగిన రాద్ధాంతం గురించి ఘాటుగా స్పందించారు. ఆ యాడ్‌లో తాను వేసుకున్న చోళీని ఏకంగా నేషనల్ ఇష్యూగా మార్చి డిబేట్లు పెట్టడం చూసి షాక్ అయ్యానన్నారు కృతి. సంస్కృతి, సంప్రదాయాల గురించి లెక్చర్లు ఇచ్చే వాళ్లే.. తన ఫ్యామిలీ మెంబర్స్ సోషల్ మీడియా పోస్టుల కింద బూతులతో కామెంట్లు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కృతి అనేది మహిళ మనసులో ఉంటుంది కానీ, వేసుకునే బట్టల్లో కాదన్నారు కృతి. అమ్మాయిలను బాడీ షేమింగ్ చేసే హక్కు ఎవరిచ్చారని కృతి నిలదీశారు. కృతి తీసుకున్న ఈ బోల్డ్ స్టాండ్‌కు కరీనా కపూర్ కూడా ఫుల్ సపోర్ట్ ఇచ్చారు. సెలబ్రిటీలు కూడా మనుషులేనని, సమాజంలో పాతుకుపోయిన ఈ ధోరణి మారాలంటూ కృతి చేసిన కామెంట్స్ ఇప్పుడు ఆన్‌లైన్‌లో హాట్ టాపిక్‌గా మారాయి..

క్రిస్మస్ కానుకగా షారుఖ్ ఖాన్ 'కింగ్'.. కొత్త పోస్టర్ విడుదల.!

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'కింగ్' నుంచి మేకర్స్ తాజాగా ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్ మరోసారి రొమాంటిక్ లవర్ బాయ్ లుక్‌లో కనిపించి అభిమానులను అలరించనున్నారు. తన 60 ఏళ్ల వయసులోనూ లవర్ బాయ్‌గా నటిస్తున్నట్లు ఈ పోస్టర్ ద్వారా తెలుస్తుంది. ఈ సినిమాకు సిద్దార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తుండగా, సోషల్ మీడియా వేదికగా షారుఖ్ ఖాన్ ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ సినిమా థియేట్రికల్ విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించారు."ఆజ్ ఫిర్ యాద్ ఆయా... కాతిల్ నహీ... ఆషిక్ హూ మే..." అంటూ షారుఖ్ ఖాన్ తన ఇన్ స్టాగ్రామ్ ఖాతాలో క్యాప్షన్ ఇస్తూ ఈ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, ఆయన కూతురు సుహానా ఖాన్ కూడా కీలక పాత్రలో కనిపించనుంది. వీరితో పాటు దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్, రాణి ముఖర్జీ తదితరులు ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

త్రివిక్రమ్ రైటింగ్ మ్యాజిక్ చేస్తుంది

'ఈ ఆఫర్ నా వద్దకొచ్చినప్పుడే.. ఇందులో నాది అమ్మ పాత్ర అని చెప్పారు. అయినప్పటికీ 'నో' చెప్పాలనే ఆలోచన నాకు కలుగలేదు. అసలు వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్ సినిమాలో నటించడమే అదృష్టం. పైగా కథ విన్నాక.. ఇలాంటి సినిమాలు, పాత్రలు అరుదుగా వస్తాయి అనిపించింది. అందుకే ఆలోచించకుండా 'ఎస్' చెప్పేశా' అని కథానాయిక శ్రీనిధిశెట్టి అన్నారు. వెంకటేశ్‌కి జోడీగా ఆమె నటించిన ఫ్యామిలీ థ్రిల్లర్ 'ఆదర్శకుటుంబం -హౌస్ నెం.47'. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎస్.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానున్నది. సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో శ్రీనిధిశెట్టి మాట్లాడారు. 'త్రివిక్రమ్ డైరెక్షన్‌లో సినిమా చేయడం నా డ్రీమ్. అలాంటిది ఆయన నుంచి కాల్ రావడంతో నా ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఇది క్రైమ్ కామెడీ మూవీనేను తొలిసారి కామెడీ చేశాను. చిట్‌ఫండ్‌లో డబ్బు పోగొట్టి, ఊరంతా అప్పులు చేస్తాను. నా కెరీర్‌లో ఇలాంటి పాత్ర చేయడం ఇదే ప్రథమం. వెంకటేశ్ గొప్ప నటుడు. ఆయన కామెడీ టైమింగ్, ఎమోషన్స్‌నీ మ్యాచ్ చేయడం కష్టం. త్రివిక్రమ్ సూచనలతో కామెడీని సహజంగా చేసేందుకు ట్రై చేశా. త్రివిక్రమ్ డైలాగ్స్‌లో చక్కని భావం ఉంటుంది. దాన్ని అర్థం చేసుకొని నటించాను. ఈ సినిమాలో త్రివిక్రమ్ రైటింగ్ మ్యాజిక్ చేస్తుంది. 'చచ్చే సైన్యం లేకుండా గెలిచే యుద్ధం ఏది సార్?' అనే డైలాగ్ నాతో పాటు అందరికీ నచ్చింది' అంటూ పేర్కొన్నది శ్రీనిధిశెట్టి. ఇటీవలే సినిమా చూశానని, అద్భుతం అనిపించిందని ఈ సినిమాలో కామెడీ ఎంత ఎంజాయ్ చేస్తారో, యాక్షన్‌ని కూడా అంతే ఎంజాయ్ చేస్తారని శ్రీనిధి తెలిపింది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.